ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి

RNI TGTEL/25/A5065

# vaartha sandhya
# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు




Published From : Rangareddy, Hyderabad | e - paper.vaarthasandhya.in | సంపుటి : 01 | సంచిక : 70 | సోమవారం | 23 - 02 - 2026 | ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ | పేజీలు : 08 | వెల : 6/-
Published From : Rangareddy, Hyderabad | e - paper.vaarthasandhya.in | VOLUME : 01 | Issue : 70 | Monday | 23 - 02 - 2026 | Editor : Seggem Kiran Kumar | Pages : 08 | Price : 6/-

### వచ్చే రెండు, మూడేళ్లలో
# ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- దేవాదుల ప్రాజెక్టును పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి
- ప్రాజెక్టు పరిశీలన అనంతరం పనుల పురోగతిపై అధికారులతో సీఎం సమీక్ష
- గోదావరి జలాల వివాదం కొన్నాళ్లుగా రాజకీయరంగు పులుముకుందని వ్యాఖ్య
- గడిచిన పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఇప్పుడు వివాదమే ఉండేది కాదు
- మేడిగడ్డ కుంగిన తర్వాత అక్కడి నుంచి నీరు ఎత్తిపోయలేదన్న రేవంత్ రెడ్డి
- పదేళ్లు వాళ్లేం చేశారో ఈ ప్రభుత్వం ఏ చేసిందో సభలో చర్చిస్తామన్నారు సీఎం రేవంత్ రెడ్డి



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 22:** గోదావరి జలాల వివాదం కొన్నాళ్లుగా రాజకీయరంగు పులుముకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గడిచిన పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఇప్పుడు వివాదమే ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద దేవాదుల ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పై ఆయన పలు విమర్శలు గుప్పించారు.మేడిగడ్డ కుంగిన తర్వాత అక్కడి నుంచి నీరు ఎత్తిపోయలేదని రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం నిరుపయోగమైనా అత్యధికంగా వరి దిగుబడి వస్తోందని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో, తర్వాత తెలంగాణలో ఏం జరిగిందో చర్చించామని చెప్పారు. కేసీఆర్, హరీశ్‌రావు తప్పులు చేశారని ప్రజలు గ్రహించారు, - మిగతా 2 లో

### బీజేపీ అధ్యక్షుడు
# రామచందర్ రావు అరెస్టు


2 లో

- కిషన్ రెడ్డి ఆగ్రహం
- బాన్సువాడ, కామారెడ్డిలకు వెళ్లేందుకు ప్రయత్నించిన రామచందర్ రావు
- ఉదయం నుంచి హౌస్ అరెస్టు, ఆ తర్వాత అరెస్టు చేసిన పోలీసులు
- రామచందర్ రావు అరెస్టును ఖండించిన కిషన్ రెడ్డి
- కాటిపల్లి వెంకటరమణారెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం


2 లో

# జూబ్లీహిల్స్‌లో బీభత్సం సృష్టించిన స్పోర్ట్స్ కారు

- జూబ్లీహిల్స్‌లో అదుపుతప్పిన ఫెరారీ స్పోర్ట్స్ కారు
- అతివేగంతో ఇతర వాహనాలను ఢీకొట్టి బీభత్సం
- ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలు, ఆస్పత్రికి తరలింపు
- రోడ్ నెం. 45లో భారీగా నిలిచిన ట్రాఫిక్
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలన్న పోలీసుల సూచన

### విదేశీ అతిథుల ముందు
# దేశం పరువు తీశారు

- భారత ప్రధానమంత్రి మోదీ
- యూత్ కాంగ్రెస్ షర్ట్ లెస్ నిరసనపై తీవ్రస్థాయిలో స్పందించిన ప్రధాని మోదీ
- ఏఐ సదస్సులో కాంగ్రెస్ నగ్న రాజకీయాలు చేసిందన్న ప్రధాని
- కాంగ్రెస్ పార్టీ సైద్ధాంతికంగా దివాలా తీసిందని విమర్శ
- విదేశీ అతిథుల ముందు దేశం పరువు తీశారని ఫైర్
- కాంగ్రెస్‌ను విమర్శించిన ఇండియా కూటమి భాగస్వాములకు మోదీ ధన్యవాదాలు



**వార్త సంధ్య, ఢిల్లీ, ఫిబ్రవరి 22:** ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో జరిగిన 'ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన తెలపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలోనే అత్యంత పురాతన పార్టీ అయిన కాంగ్రెస్ సైద్ధాంతికంగా దివాలా తీసిందని ఈ ఘటన స్పష్టం చేస్తోందని ఆదివారం మీరట్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో విమర్శించారు.కొద్ది రోజుల క్రితం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై యూత్ కాంగ్రెస్ సభ్యులు ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ ఘటనపై మోదీ స్పందిస్తూ, "భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ప్రజలు కష్టపడుతుంటే, దేశ ప్రగతిని కొన్ని పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ - మిగతా 2 లో

# నిల్వ కుళ్ళిన మాంసం అమ్మకాలు!

## "రెడ్డి చికెన్ మార్కెట్"

- లైసెన్స్ ఇస్తే సరిపోతుందా?
- తనిఖీలు చేయాల్సిన అవసరం లేదా?
- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం
- కోడి కోసిన రెండు గంటల్లోనే చికెన్ తినాలి
- నిల్వ చికెన్ తింటే ప్రమాదకరం అంటున్న వైద్య నిపుణులు




**రంగారెడ్డి జిల్లా బ్యూరో / ఎల్బీనగర్ ప్రతినిధి ఫిబ్రవరి 22 ( వార్త సంధ్య ) :** ఎల్బీనగర్ పరిధిలో నిల్వ ఉంచిన, ఎక్స్పైరీ అయిపోయిన చికెన్ మాంసం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. కొన్ని చికెన్ షాపులు ఫ్రెష్ మాంసంతో పాటు నిల్వ ఉంచిన కూలిన చికెన్‌ను కలిపి అమ్ముతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అధిక డిమాండ్ ఉన్న సమయాల్లో పాత మాంసాన్ని ఐస్‌లో నానబెట్టి, బయటకు ఫ్రెష్‌గా కనిపించేలా చేసి విక్రయిస్తున్న - మిగతా 5 లో





2 లో

# ఏపీలో భారత్‌నెట్ విస్తరణ

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం
- ఏపీలో భారత్‌నెట్ విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం
- ప్రాజెక్టు అమలుకు రూ. 2,432 కోట్లు విడుదల చేయనున్న కేంద్రం
- సుమారు 5 లక్షల గ్రామీణ గృహాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్లు
- రాష్ట్రవ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీల్లో ప్రాజెక్టు అమలు

### రాష్ట్రంలో బీజేపీ అంటే
# బాబు-జగన్-పవన్



- బీజేపీకి కొత్త అర్థం చెప్పిన షర్మిల
- చంద్రబాబు, జగన్ పై తీవ్ర విమర్శలు
- చంద్రబాబు, జగన్‌లు బీజేపీకి బానిసలుగా మారారని షర్మిల విమర్శ
- మోదీ చైనా రోబోను ప్రదర్శించినప్పుడు వీరి నోళ్లు పెగల్లేదని ఎద్దేవా
- చంద్రబాబుది అధికారిక పొత్తు కాగా, జగన్‌ది బీజేపీతో అక్రమ పొత్తు అని ఆరోపణ
- రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అంటూ కొత్త నిర్వచనం
- రైతుల కోసం కాంగ్రెస్ నిరసన చేస్తుంటే ఉగ్రకోణం అంటారా అని ఫైర్

**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 22 :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రచారకర్తలుగా, బీజేపీ ఎదుట బానిసలుగా మారారని, స్వప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే తోలుబొమ్మలని ఆమె తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుది బీజేపీతో అధికారిక పొత్తు అయితే, జగన్‌ది అక్రమ పొత్తు అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అని, - మిగతా 2 లో

### టెక్నాలజీ పెరిగినా మీ
# 'హ్యూమన్ టచ్'కు సాటిలేదు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- గ్రామీణ డాక్ సేవక్‌లపై సీఎం చంద్రబాబు ప్రశంసలు
- గ్రామీణ డాక్ సేవకుల సేవలు అమూల్యం అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని సమర్థతపై ప్రశంసలు
- ఏపీలోని 17,000 మంది డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి
- రాష్ట్ర ప్రభుత్వ సేవలను కూడా డాక్ సేవకుల ద్వారా అందిస్తామని హామీ
- వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో పోస్టల్ ఉద్యోగులదే కీలక పాత్ర అని వెల్లడి



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 22 :** టెక్నాలజీ ఎంత అభివృద్ధి సాధించినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి అందుబాటులోకి వచ్చినా, గ్రామీణ ప్రాంతాల్లో మానవతా స్పర్శతో సేవలు అందించే గ్రామీణ డాక్ సేవకులకు ప్రత్యామ్నాయం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో వారి పాత్ర అత్యంత కీలకమని, వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం నాడు గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్‌లతో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఎందరికో స్ఫూర్తి



నాలుగు గోడల మధ్యనే ఉంటూ, నాలుగు దిక్కుల పట్ల అవగాహన కలిగి ఉండటం, నాలుగు దశాబ్దాల కిందట అసాధ్యమే! పోలియో వల్ల కాళ్లు చచ్చుబడి నడవలేని స్థితిలో ఉంటే, చింతిస్తూ కన్నీళ్లతో కాలం గడుపుతారు ఎవ్వరైనా! కానీ ఎనిమిదేళ్ల వయస్సులో ఒక బాలిక అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. అంగవైకల్యం జీవనయాత్రకు అడ్డుకాదని, సృజనాత్మకతతో ఆలోచించి, జీవితాన్ని రంగులమయం చేసుకోవచ్చని నిరూపించింది ఆ బాలిక. కృషి, పట్టుదల ఉంటే ఎటువంటి క్లిష్ట పరిస్థితులనైనా మనకు అనువుగా మలచుకొని, స్వయంకృషితో సమాజ గుర్తింపు పొందవచ్చునని చాటి చెప్పింది. ఆ బాలికే రాగతి పండరి.తొలి తెలుగు మహిళా కార్టూనిస్టుగా లక్షలాది పాఠకుల హృదయాల్లో చెదరని ముద్రవేసింది. కార్టూన్‌కు అర్థం తెలియని వయస్సులో ఆమె ఈ రంగంలోకి అడుగుపెట్టింది. కళపై ఉన్న మక్కువతోనే కార్టూన్ కళాకారిణి కాగలిగింది. పుట్టిన ఏడాదికే పోలియో వల్ల ఆమె రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. దాంతో ఆమె ఇంటికే పరిమితమైంది. రాగతికి తన రెండో అక్క రత్నకుమారి రాయడం, చదవడం నేర్పింది. ఇంటికి వచ్చే పుస్తకాలు చదవడం, అందులో వచ్చే కార్టూన్లు అర్థం చేసుకోవడంతో వాటిపై ఆమెకు అభిరుచి పెరిగింది. ఆమెకూ కార్టూన్లు గీయాలన్న కోరిక కలిగింది. తన ఎనిమిదవ ఏట ప్రారంభమైన కార్టూన్ల సృష్టి, ఆమె మరణించే వరకూ కొనసాగించింది.ప్రముఖ తెలుగు కార్టూనిస్టులు జయదేవ్, బాపు, బాలి, గోపి, బి.ఎస్.రాజు వంటి వారు ఆమెకు తగిన సూచనలు, సలహాలను ఉత్తరాల ద్వారా, స్వయంగా కలిసినప్పుడు తెలిపేవారు. ఆమె ఆ మెళకువలు నేర్చుకుని, అవలీలగా అల్లుకుపోయారు. ప్రతి తెలుగు పత్రికలో ఆమె కార్టూన్లు ప్రచురితమై, విశేష ప్రాచుర్యం పొందాయి. ప్రతి పాఠకుడి మనసునూ మురిపించాయి. మూడున్నర దశాబ్దాల పాటు ఆమె 25వేలకు పైగా కార్టూన్లు గీశారు. అధిక ధరలు, వరకట్నం, ర్యాగింగ్, మంచినీటి కొరత, కాలుష్యం వంటి సామాజిక సమస్యలే కాక, సంక్రాంతి, ఉగాది, వినాయక చవితి, దసరా, దీపావళి వంటి పండుగల పైనా పలు కార్టూన్లు గీశారు. ఆమె మేధస్సులో మెరిసిన మెరుపులు అనేకం!ప్రముఖ రచయిత ఎల్యూ నారాయణరావుతో కలిసి 'యవ్వనం పిలిచింది, అయ్యో పాపం అబ్బాయిలు, దెయ్యాలు ఎక్కడ ఉన్నాయి?' వంటి కార్టూన్ కథలు అల్లారు. సిక'రాజ'కీయంలో, రాజకీయ'చెద'రంగం శీర్షిక పదేళ్ళు కొనసాగింది. అదేవిధంగా, పొడుగుపొట్టి అమ్మాయిలు, నవగ్రహంఅనుగ్రహం, మగాడి చెవిలో పూవు, అంకాలమ్మ అడవిలో వంటి కార్టూన్ సీరియల్స్ విశేష ఆదరణ పొందాయి. ఆమె చిత్రించిన 200 కార్టూన్లతో 'నవ్వుల విందుకార్టూన్ల పసందు' పేరుతో విశాలాంధ్ర పుస్తకాన్ని ప్రచురించింది. ఆమె ఆత్మకథ 'నా గురించి నేను' విశాఖకు చెందిన చిత్రకళా పరిషత్ ప్రచురించింది.మద్రాసు తెలుగు అకాడమీ 'ఉగాది' పురస్కారాన్ని నాటి గవర్నర్ రంగరాజన్ నుంచి, 'కళారత్న' ప్రతిభా పురస్కారాన్ని మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి నుంచి రాగతి పండరి అందుకున్నారు. ఆమె మృతి చెందడానికి వారం ముందు ఆసుపత్రి మంచంపై ఉండి కూడా రెండు చక్కని హాస్యకార్టూన్లు గీసి అక్కడి సిబ్బందిని ఆనందపర్చారు. మరణానంతరం తన దేహం సమాజానికి ఉపయోగపడాలని భావిస్తూ, విశాఖలోని ఎస్.ఆర్.వైద్యకళాశాలకు తన దేహాన్ని రాసిచ్చేయడం ఆమెలోని మానవతా విలువలకు నిదర్శనం. నేడు రాగతి పండరి వర్ధంతి. ఆమె భౌతికంగా మృతి చెందినా కార్టూనిస్టుల మనసుల్లో చిరకాలం నిలిచే ఉంటారు.

## విదేశీ అతిథుల ముందు దేశం పరువు తీశారు

**మొదటిపేజీ తరువాయి** – సదస్సును భారత్ నిర్వహించడం ప్రతి ఒక్కరికీ గర్వకారణం. కానీ కాంగ్రెస్ ఈ ప్రపంచ వేదికను తమ నీచ, నగ్న రాజకీయాలకు వాడుకుంది" అని అన్నారు."విదేశీ అతిథుల ముందు కాంగ్రెస్ నేతలు నగ్నంగా నిలబడ్డారు. అసలు మీ నగ్నత్వం దేశానికి ఇప్పటికే తెలుసు, మళ్లీ కొత్తగా బట్టలు విప్పాల్సిన అవసరం ఏముంది?" అని ప్రధాని ప్రశ్నించారు. సొంత దేశం పరువు తీయడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందని ఆయన ఆరోపించారు. తనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు తన సమాధి తవ్వాలని చూడటం, తన తల్లిని దూషించడం వంటివి చేస్తున్నారని, అయితే దేశ ప్రతిష్ఠకు సంబంధించిన కార్యక్రమంలో ఇలా ప్రవర్తించడం హద్దులు మీరడమేనని అన్నారు.దేశం పరువు తీసిన వారిని విమర్శించాల్సింది పోయి, కాంగ్రెస్ అగ్రనేతలు ఆ నిరసనకారులను ప్రశంసించడం దురదృష్టకరమని మోదీ వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఘటనపై కాంగ్రెస్‌ను విమర్శించిన ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## మావోయిస్టు కీలక నేతలు లొంగుబాటు


**మొదటిపేజీ తరువాయి** – కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'లో కీలక పరిణామం చోటు చేసుకున్నది. మావోయిస్టు కీలక నేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి భద్రతా బలగాలకు సరెండర్ అయ్యారు. దేవ్ జీ మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీగా ఉండగా, రాజిరెడ్డి పొలిట్ బ్యూరో మెంబర్‌గా ఉన్నారు. రెండు రోజుల్లో వారిని మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు.వీరితో పాటు మరో 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీ అలియాస్ తిరుపతి తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాకు చెందినవాడు. వీరంతా తెలంగాణ ఎస్‌ఐబీ ఎదుట సరెండర్ అయ్యారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత సెక్రటరీగా దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి మావోయిస్టు పార్టీకి సారథ్యం వహిస్తున్నారు.

## జూబ్లీహిల్స్‌లో బీభత్సం సృష్టించిన స్పోర్ట్స్ కారు



**మొదటిపేజీ తరువాయి** – హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఆదివారం ఓ ఫెరారీ స్పోర్ట్స్ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంతో ప్రయాణిస్తున్న ఈ కారు రోడ్ నెం. 45లో అదుపుతప్పి పక్క రోడ్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో పలు కార్లు, బైక్‌లను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటన సినీ నటుడు నందమూరి బాలకృష్ణ నివాసానికి సమీపంలో చోటుచేసుకుంది. ప్రమాదం ధాటికి వాహనాలు నుజ్జునుజ్జవగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.ప్రమాదం కారణంగా రోడ్డుపై వాహనాలు అడ్డదిడ్డంగా పడిపోవడంతో రోడ్ నెం. 45లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు.రోడ్ నెం. 45 నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు, అలాగే కేబుల్ బ్రిడ్జి నుంచి రోడ్ నెం. 45 వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. వాహనదారులు ఈ మార్గాలను తప్పించి ప్రత్యామ్నాయ రూట్లలో ప్రయాణించాలని పోలీసులు సూచించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టెక్నాలజీ పెరిగినా మీ 'హ్యూమన్ టచ్'కు సాటిలేదు



**మొదటిపేజీ తరువాయి** – ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, పాత రోజులను గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, ఇతర సమాచారం కోసం ప్రతి ఒక్కరూ పోస్ట్‌మ్యాన్‌పైనే ఆధారపడేవారని, బ్యాంకులు లేని రోజుల్లో ఆర్థిక లావాదేవీలకు కూడా ఇండియా పోస్టే కీలక మాధ్యమంగా ఉండేదని తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కూడా సమరయోధుల మధ్య సమాచారాన్ని చేరవేసి పరోక్షంగా కీలక పాత్ర పోషించిన వారి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

**కేంద్ర మంత్రులపై ప్రశంసల వర్షం**

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించిన ఉన్నత విద్యావంతుడని, రాజవంశంలో పుట్టినా అత్యంత పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని కొనియాడారు. సింధియా నాయనమ్మ, గ్వాలియర్ రాజమాత విజయరాజే సింధియాతో తనకు మంచి అనుబంధం ఉందని, ఆమె ఎన్టీ రామారావుగారికి అత్యంత సన్నిహితురాలని గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా, సింధియా తండ్రి మాధవరావు సింధియాతో కూడా కలిసి పనిచేశానని, ఆయన నిరాడంబరత, నిజాయతీ గొప్పవని అన్నారు. సింధియా పూర్వీకుల గ్రామమైన 'సింధియా' విశాఖపట్నం గాజువాక సమీపంలో ఉండటం ఆనందంగా ఉందని, వారి కుటుంబానికి ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న ఈ అనుబంధం గొప్పదని పేర్కొన్నారు. మరో కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానిని ప్రశంసిస్తూ, ఒక వైద్యుడిగా, ఐటీ నిపుణుడిగా అమెరికాలో అపారమైన సంపద సృష్టించి, ఇప్పుడు పార్లమెంటులో అత్యంత సంపన్న ఎంపీగా ప్రజాసేవకు ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు. వీరిద్దరి వంటి సమర్థవంతమైన నాయకులు కేంద్రంలో ఉండటం దేశానికి గర్వకారణమని చంద్రబాబు అభివర్ణించారు.

**డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లు.. ఏపీని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టండి**

భవిష్యత్తులో గ్రామీణ డాక్ సేవకుల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు నొక్కిచెప్పారు. వారి పనిభారాన్ని తగ్గించి, ఉత్పాదకతను పెంచేందుకు వీలుగా రాష్ట్రంలోని 17,000 మంది గ్రామీణ డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లను అందించాలని కేంద్ర మంత్రి సింధియాను కోరారు. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఒక 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్'గా పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల కాలుష్యరహిత ప్రయాణంతో పాటు, శ్రమ తగ్గి గ్రామీణ ప్రాంతాల్లో మరింత వేగంగా సేవలు అందించగలరని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సేవలను కూడా గ్రామీణ డాక్ సేవకుల ద్వారా ప్రజలకు చేరవేస్తామని, ఇందుకు అవసరమైన సమన్వయం చేసుకుంటామని హామీ ఇచ్చారు.

**డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు**

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉండటంతో అభివృద్ధి సూపర్ స్పీడ్‌తో ముందుకు సాగుతోందని చంద్రబాబు తెలిపారు. 20 నెలల సుపరిపాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికామని అన్నారు. ఒకప్పుడు స్మశానం, ఎడారి అన్న అమరావతిని దేవతల రాజధానిగా, ప్రపంచం మెచ్చే ప్రజా రాజధానిగా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడి, లాభాల బాట పట్టించామని, ఈ నెలలోనే రూ.54 కోట్ల లాభం వచ్చిందని వెల్లడించారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని, ఈ 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో గ్రామీణ డాక్ సేవకులే వెన్నెముకగా నిలుస్తారని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వారిపై ఉందని సూచించారు.

## రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్

**మొదటిపేజీ తరువాయి** – వీరంతా మోదీ కోసం పనిచేస్తున్నారని షర్మిల ఆరోపించారు.ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "ఏఐ సదస్సు వేదికగా ప్రధాని మోదీ ఒక చైనా రోబో బొమ్మను ప్రదర్శించి 70 దేశాల ముందు దేశ ప్రతిష్ఠను దిగజార్చారు. భారతీయ ప్రతిభను తొక్కిపెట్టి చైనా ఉత్పత్తులను చూపించి దేశానికి అవమానం తలపెట్టినప్పుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడి నోళ్లు ఎందుకు పెగల్లేదు? అప్పుడు వారికి సిగ్గుగా అనిపించలేదా? కాంగ్రెస్ నిరసనలు తెలిపినప్పుడు మాత్రం వారి నోర్లు పెగిలాయి" అని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, బాధ్యత గురించి బాబు, ఐక్యత గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ దేశం కోసం పోరాడుతుంటే మద్దతివ్వాల్సింది పోయి, అధికార పక్షానికి వంత పాడటం సిగ్గుచేటన్నారు. "ట్రంప్ పర్యటన సందర్భంగా అమెరికా ప్రయోజనాల కోసం సున్నా సుంకాలకు ఒప్పుకొని భారత రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు. ఇది రైతాంగానికి మరణశాసనం లాంటి బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని చెబుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిరసన తెలిపింది. ఈ వాస్తవాన్ని చంద్రబాబు, జగన్ అర్థం చేసుకోకపోవడం వారి అవివేకం" అని షర్మిల పేర్కొన్నారు.ప్రజల్లో కాంగ్రెస్‌కు మద్దతు పెరుగుతుండటం చూసి ఓర్వలేకే బీజేపీ తమ నిరసనకు ఉగ్రవాద కోణాన్ని అంటగడుతోందని, ఇది కేంద్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు. మోదీ కాషాయ కామెర్లు సోకిన వారు ఇలా కాకుండా ఎలా మాట్లాడతారని ఆమె వ్యంగ్యంగా



వ్యాఖ్యానించారు.

## చర్చలకు సిద్ధం.. యుద్ధానికీ సై



**మొదటిపేజీ తరువాయి** – అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. ఇరాన్ అణు కేంద్రాలపైనే కాకుండా, ఏకంగా ఆ దేశ అత్యున్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ, ఆయన వారసుడిగా భావిస్తున్న కుమారుడు మొజ్తాబా ఖమేనీలను లక్ష్యంగా చేసుకునే సైనిక ప్రణాళికలను అమెరికా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రముఖ వార్తా సంస్థ 'ఆక్సియోస్' ఒక కథనాన్ని ప్రచురించింది. ఇరాన్ తదుపరి పాలకుడిగా రేసులో ఉన్న మొజ్తాబా పేరు కూడా ఈ జాబితాలో ఉండటం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇరాన్ విషయంలో అన్ని రకాల ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని అమెరికా ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఒకవేళ యుద్ధం అనివార్యమైతే ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తొలగించేందుకు కూడా వెనుకాడబోమని ట్రంప్ సలహాదారు ఒకరు పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత దాడులు చేసే ఆలోచనలో ఉన్నారా అన్న ప్రశ్నకు తాను దాని గురించి ఆలోచిస్తున్నానని అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా బదులిచ్చారు. చర్చలకు రావడానికి ఇరాన్‌కు 10-15 రోజులు సమయం ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.అమెరికా హెచ్చరికలపై ఇరాన్ కూడా ఘాటుగానే స్పందించింది. తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని, అయితే దాడులు జరిగితే యుద్ధానికి కూడా వెనుకాడబోమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీ తేల్చి చెప్పారు. అమెరికా దాడులకు పాల్పడితే మధ్యప్రాచ్యంలోని వారి సైనిక స్థావరాలే తమ తదుపరి లక్ష్యాలని ఐక్యరాజ్యసమితికి ఇరాన్ ఇప్పటికే తెలియజేసింది.ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా మధ్యప్రాచ్యంలో సైన్యాన్ని మోహరించింది. ఇప్పటికే రెండు అమెరికా విమాన వాహక నౌకలు ఇరాన్ తీరానికి సమీపంలో ఉన్నాయి. ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాల నుంచి వేలాది మంది సైనికులను వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించింది. ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడం పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయవచ్చని, ఇది వినాశకర పరిణామాలకు కారణమవుతుందని అంతర్జాతీయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఏపీలో భారత్‌నెట్ విస్తరణ

**మొదటిపేజీ తరువాయి** – ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవలను విస్తరించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక ముందడుగు వేశాయి. అమెండెడ్ భారత్‌నెట్ ప్రాజెక్ట్ (ఏబీపీ)ను రాష్ట్రంలో సమర్థంగా అమలు చేసేందుకు ఇరు ప్రభుత్వాల మధ్య ఒక ముఖ్యమైన సహకార ఒప్పందం (టీఓఏ) కుదిరింది. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.ఈ ప్రాజెక్టు కింద రాష్ట్రానికి రూ. 2,432 కోట్ల నిధులను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సుమారు 5 లక్షల కుటుంబాలకు ఫైబర్ కనెక్షన్ల ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను అందించడం. దీని అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఏపీబీఐఎల్) పేరుతో ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ)ను ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను డిజిటల్ భారత్ నిధి, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా సమకూర్చనున్నాయి. కేంద్రం తరపున డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13,426 గ్రామ పంచాయతీల్లో నెట్‌వర్క్‌ను విస్తరించనున్నారు. ఇందులో భాగంగా, ఇప్పటికే ఫేజ్-× కింద ఉన్న 1,692 పంచాయతీల్లోని నెట్‌వర్క్‌ను ఆధునీకరిస్తారు. అలాగే, ఫేజ్-×× కింద 11,254 గ్రామాల్లో డిజిటల్ కనెక్టివిటీ పనులను పూర్తి చేస్తారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కూడా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించనున్నారు. వీటికి అదనంగా, స్థానిక అవసరాలు, డిమాండ్‌ను బట్టి 3,942 గ్రామాల్లో లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రాజెక్టు సజావుగా సాగేందుకు అవసరమైన రైట్ ఆఫ్ వే అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, క్షేత్రస్థాయిలో సమన్వయం వంటి బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుంది.గ్రామాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈ-గవర్నెన్స్ సేవలు మరింత పటిష్ఠంగా ప్రజలకు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఒప్పందం గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ విప్లవానికి బాటలు వేస్తుందని, సమ్మిళిత అభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## వచ్చే రెండు, మూడేళ్లలో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం




**మొదటిపేజీ తరువాయి** – తీర్పు ఇచ్చారుని రేవంత్ రెడ్డి వివరించారు. పదేళ్లు వాళ్లేం చేశారో ఈ ప్రభుత్వం ఏ చేసిందో సభలో చర్చిస్తామన్నారు. పదేళ్ల అనుభవంతో వాళ్లు సూచనలు చేస్తే మేం స్వీకరిస్తామన్న రేవంత్ రెడ్డి జలాల విషయంలో ఏపీకి సహకరిస్తున్నామనేది పూర్తిగా అసంబద్ధమని వ్యాఖ్యానించారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం ప్రజలు, నీళ్ల విషయంలో కాదని హితవు పలికారు. పలు ఎన్నికల్లో తీర్పు చూసిన తర్వాతైనా బీఆర్ఎస్ నేతలు మారకపోవటం విచారకరమన్నారు. బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపించకపోవడం ప్రజల తప్పనట్లుగా వారు వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఓటు వేసిన ప్రజలను బహిష్కరించినట్లు చేయటం సరికాదని ఆయన తెలిపారు. ప్రజలను తప్పుపట్టడం మానేసి విజ్ఞతగా వ్యవహరించాలని హితవు పలికారు.వచ్చే రెండు మూడేళ్లలో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఉన్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు మీదే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేయడం వల్ల మిగతా ప్రాజెక్టులకు, భూ సేకరణకు తీవ్రంగా నిధుల కొరత ఉందని తెలిపారు. రూ.6వేల కోట్ల అంచనాతో మొదలుపెట్టిన దేవాదుల ఇవాళ రూ.18 వేలకోట్ల అవసరమైన స్థితికి చేరుకుందన్నారు. అన్ని ప్రాజెక్టులపై సమీక్ష చేసి పూర్తి చేయాలని నిర్ణయించామని తెలిపారు. ప్రాజెక్టులు పూర్తి చేసుకుని రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసుకోవాలన్నారు.సీఎం కుర్చీ అనేది ప్రతిసారి వారసత్వంగా దక్కదని రేవంత్ రెడ్డి అన్నారు. టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు వరసగా రెండుసార్లు చొప్పున ప్రజలు అవకాశం ఇచ్చారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజలు మరో అవకాశం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులను గాలికి వదిలేయమని వివరించారు. ప్రజల సొమ్ముతో కట్టిన ప్రాజెక్టులను వృథాగా వదిలేసేది లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిపుణుల సూచన ప్రకారం మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తామని వెల్లడించారు. విపక్షం అసెంబ్లీకి వచ్చి గోదావరి జలాలపై సూచనలు చేస్తే స్వీకరిస్తామని చెప్పారు. ఏపీతో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునే దిశలో ఉన్నామని వెల్లడించారు.

## బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు అరెస్టు

**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావును పోలీసులు అరెస్టు చేశారు. కామారెడ్డి, బాన్సువాడలకు వెళ్లేందుకు ఆయన ప్రయత్నించడంతో తార్నాకలోని ఆయన నివాసం వద్ద పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. రామచందర్ రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. రామచందర్ రావును అరెస్టు చేసిన సమయంలో పోలీసులు, బీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది.కామారెడ్డి జిల్లా బాన్సువాడలో రెండు వర్గాల మధ్య ఇటీవల ఘర్షణ జరిగిన నేపథ్యంలో అక్కడకు వెళ్లేందుకు రామచందర్ రావు సిద్ధమయ్యారు. అదే సమయంలో కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ వారు దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ అక్కడకు కూడా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఉదయం నుంచి రామచందర్ రావును గృహ నిర్బంధం చేసిన పోలీసులు, ఆ తర్వాత అరెస్టు చేశారు.

**రామచందర్ రావు అరెస్టును ఖండించిన కిషన్ రెడ్డి**

రామచందర్ రావు అరెస్టును కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. బాన్సువాడ, కామారెడ్డిలకు ఆయన వెళ్లకుండా అడ్డుకోవడం దారుణమని అన్నారు. కామారెడ్డిలో ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరిగిందని, ఇది ఆందోళనకరమని ఆయన అన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డిలో గెలిచినందుకు కాటిపల్లి వెంకటరమణారెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలకు పాల్పడటం సరికాదని అన్నారు.



## బస్సులు ఆపాలని బస్సు డిపో డిఎం కు వినతి పత్రం అందజేసిన

### బిజెపి మాజీ మండల అధ్యక్షుడు బోయిని నారాయణ



**మంథని ఫిబ్రవరి 22 (వార్త సంధ్య) :** మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి, కూచిరాజ్ పల్లి, శ్రీరామ్ నగర్ స్టేజీల వద్ద ప్రతి బస్సు ఆపాలని బిజెపి మాజీ మంథని మండల అధ్యక్షులు మంథని మున్సిపల్ 5వ వార్డ్ బిజెపి కాంటెస్టెడ్ కౌన్సిలర్ అభ్యర్థి బోయిని నారాయణ బస్ డిపో డిఎం కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి, కూచిరాజ్ పల్లి, శ్రీరామ్ నగర్ బస్ స్టాప్ ల వద్ద ప్రతి బస్సును ఆపాలని దూర ప్రయాణాలు చేసే ప్రయాణికులు అర్ధరాత్రి వేళ ఆ స్టేజీల వద్ద బస్సులు ఆపకపోవడంతో మంథని బస్టాండ్ కి వచ్చి బస్సు ఎక్కాల్సి వస్తుందని ముఖ్యంగా అర్ధరాత్రి వేళల్లో స్వగ్రామాలకు వెళ్లడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ స్టేజీల వద్ద ప్రయాణికులకు సహకరించి ప్రతి బస్సును ఆపాలని మంథని డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్ కి మంథని మున్సిపల్ 5వ వార్డు బిజెపి కాంటెస్ట్ డ్ కౌన్సిలర్ అభ్యర్థి బోయిని నారాయణ వినతిపత్రం అందజేశారు.

## హబ్సిపూర్ టీ10 బ్లాస్ట్ ఫైనల్‌లో హబ్సిపూర్ క్లబ్ విజయం



**దుబ్బాక ప్రతినిధి ఫిబ్రవరి 22 (వార్త సంధ్య ) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్సిపూర్ గ్రామంలో గత నెల 25వ తేదీన ప్రారంభమైన టీ10 బ్లాస్ట్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం ఉత్కంఠభరితంగా జరిగింది. ఫైనల్ పోరులో హబ్సిపూర్ క్లబ్ మరియు రాజన్న లెవెల్ జట్లు తలపడ్డాయి. ఆసక్తి కరంగా సాగిన మ్యాచ్‌లో హబ్సిపూర్ క్లబ్ విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేత జట్టుకు రూ.50,000 నగదు బహుమతిని గ్రామ సర్పంచ్ శ్రీలత రామచంద్ర రెడ్డి అందజేశారు. రన్నరప్ జట్టుకు రూ.25,000 బహుమతి ప్రదానం చేశారు.ఈ కార్యక్రమానికి దుబ్బాక ఎస్సై కీర్తి రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే గ్రామ ఉపసర్పంచ్ ప్రవీణ్ గౌడ్, మాజీ సర్పంచ్ అస్స శ్రీనివాస్, యాడారం రాజు గౌడ్, తుమ్మల నరసింహులు, వార్డు సభ్యులు పాల్గొని విజేత జట్టును అభినందించారు. గ్రామ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా ఈ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించబడిందని నిర్వాహకులు తెలిపారు.

## సిద్దిపేట జిల్లాలో యాదవుల రాజ్యాధికార పార్టీ ఆవిర్భావ సభ



**దుబ్బాక ప్రతినిధి ఫిబ్రవరి 22 (వార్త సంధ్య ) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని భూంపల్లిలో యాదవ రాజ్యాధికార పార్టీ ఆవిర్భావ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సభకు వ్యవస్థాపక అధ్యక్షులు బెల్లి చంద్రశేఖర్ యాదవ్, బెల్లి మధుకర్ యాదవ్, దండ బోయిన రాజు యాదవ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కుల రాజ్యాధికార పార్టీల వ్యవస్థాపకులు బత్తుల సిద్దేశ్వర్, మాల మహా రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కొంగర నరహరి మాదిగ, రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ముక్క ప్రభాకర్, ఉపాధ్యక్షులు కె విజయకుమార్ పాల్గొన్నారు. అలాగే వడ్డెర రాజ్యాధికార పార్టీ అధ్యక్షురాలు గుత్తి రమ్య, మున్నూరు కాపు రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శి బత్తుల రామ్ నర్సయ్య, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతుల మల్లయ్య, రజక రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు చాపర్తి కుమార్ గాడ్గే, రజక రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు శనిగరం సత్యం, గౌడ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అంతటి హరిప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్, గంగపుత్ర రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బండారి గంగాధర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్ని కుల సంఘాలతో సమావేశాలు నిర్వహించి చర్చల అనంతరం బడుగు బలహీన వర్గాల రాజ్యాధికార సాధన కోసం నూతన పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీసీల రాజ్యాధికార పోరాటానికి అన్ని కుల సంఘాలు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బతుకుల వెంకటేశం యాదవ్, వాసర యాదగిరి యాదవ్, బొడ్డు పోచయ్య యాదవ్, చిరంజీవి యాదవ్, దండ బోయిన రమేష్ యాదవ్, కంపే స్వామి యాదవ్, గూడెం సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొని సభను విజయవంతం చేశారు.

## రైతు బడి అగ్రి షోకు హైదరాబాద్‌కు తరలివెళ్లిన అందె రైతులు



**దుబ్బాక ప్రతినిధి ఫిబ్రవరి 22 (వార్త సంధ్య ) :** సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అందె గ్రామ అభివృద్ధి ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం లో నిర్వహిస్తున్న రైతు బడి అగ్రి షో సదస్సుకు అందె గ్రామం నుండి సుమారు 60 మందికి పైగా రైతులు తరలివెళ్లారు.రైతులు ఆధునిక సాగు పద్ధతులు, డ్రిప్ మరియు స్ప్రింక్లర్ నీటిపారుదల విధానాలు, నూతన వంగడాలు, అధిక




దిగుబడులు ఇచ్చే విత్తనాలు, సమగ్ర ఎరువుల యాజమాన్యం, పురుగుమందుల సక్రమ వినియోగం వంటి అంశాలపై నిపుణుల ద్వారా ప్రత్యక్ష అవగాహన పొందారు. అలాగే వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్లు, పంట కోత యంత్రాలు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెటింగ్ విధానాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా రైతు బడి సీఈఓ రాజేందర్ రెడ్డిని కలిసి అందె గ్రామంలో పండించే కూరగాయల పంటల వివరాలను తెలియజేశారు. ఇలాంటి సదస్సులు గ్రామీణ రైతులకు కొత్త దిశానిర్దేశం చేస్తూ వ్యవసాయాన్ని లాభదాయక వృత్తిగా మార్చేందుకు దోహదపడతాయని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీ పరికరాలు నేరుగా అందే విధంగా చర్యలు తీసుకుని వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బుర్ర సతీష్, ప్రధాన కార్యదర్శి అందె ప్రవీణ్, ఉపాధ్యక్షులు జక్కుల రాజయ్యతో పాటు రైతులు పక్రొద్దీన్, నర్సింహా రెడ్డి, బాలయ్య, శ్రీనివాస్, రాజు, కుమార్, కనకయ్య, పర్శరాములు, సాగర్, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేశినేని ఫౌండేషన్ ద్వారా రైతులకు ఆర్గానిక్ వ్యవసాయం పై సమగ్ర శిక్షణ ఎంపీ కేశినేని శివనాథ్

**ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆర్గానిక్ రైతోత్సవం నేచురల్ ఫార్మింగ్ మేళా-2026**

**రైతోత్సవం- మేళా 2026ను ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్**

**ఎన్టీఆర్ జిల్లా ఆర్గానిక్ రైతోత్సవం -2026 ఒక వినూత్నమైన కార్యక్రమం**

**రైతులు ఎరువులు వాడకం తగ్గించాలనేది సిఎం చంద్రబాబు ఆకాంక్ష**

**జిల్లాలోని 16 మండలాల్లో రైతులకు కేశినేని ఫౌండేషన్ ద్వారా అవగాహన కార్యక్రమం**

**మే నెల నుంచి ఆర్గానిక్ వ్యవసాయం పై శిక్షణా తరగతులు మొదలు**




**కృష్ణాజిల్లా ,బ్యూరో ఫిబ్రవరి 22, (వార్త సంధ్య):** విజయవాడ: కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా విస్తృత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ ప్రకటించారు. జిల్లాలోని 16 మండలాల్లో మండలాల వారీగా మూడు రోజుల సమగ్ర శిక్షణ శిబిరాలు నిర్వహించి రైతులను ఆర్గానిక్ వ్యవసాయం వైపు మళ్లించేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు.ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఆర్గానిక్ రైతోత్సవం , నేచురల్ ఫార్మింగ్ మేళా- 2026 కు ఎంపి కేశినేని శివనాథ్ ముఖ్య అతిధిగా హాజరై ఈ కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ లకు కలెక్టర్ లక్ష్మీశా స్వాగతం పలికారు. సభానంతరం స్వచాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకరన్ లను ఎంపీ కేశినేని శివనాథ్ సన్మానించగా, ఎంపీ కేశినేని శివనాథ్ ను కలెక్టర్ లక్ష్మీ శా సన్మానించారు.అంతకు ముందు స్టేడియంలో ఏర్పాటు చేసిన సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ స్టాళ్లు, సేంద్రియ సాగుకు సంబంధించిన ఉత్పాదితాల ప్రదర్శనలను ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షురాలు గద్దె అనురాధ, రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్, ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకరన్, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు లతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ సందర్శించారు. ఆ స్టాల్స్ ఏర్పాటు చేసిన ఉత్పత్తుల యాజమాన్యులతో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాబోయే రెండు నెలల్లో అగ్రికల్చర్, హార్టికల్చర్, యానిమల్ హస్బెండరీ తదితర ఐదు విభాగాల సమన్వయంతో ప్రతి మండలంలో మూడు రోజుల వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మే నెల నుంచి ఈ కార్యక్రమాలు ప్రారంభమ వుతాయని తెలిపారు. దేశంలోని ప్రముఖ వ్యవసాయ పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించి రైతులకు అవగాహన తరగతులతోపాటు ప్రాక్టికల్ శిక్షణ అందిస్తామని చెప్పారు.వర్క్‌షాప్‌లలో మొదటి రోజు అవగాహన తరగతులు, రెండో రోజు ఫీల్డ్ విజిట్, మూడో రోజు ఉత్తమ ప్రాక్టీషనర్లతో ప్రత్యేక శిక్షణ నిర్వహించనున్నట్లు వివరించారు. హైదరాబాద్ లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ (ఎన్.ఐ.ఆర్.డి) లో కేశినేని ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే సుమారు 1200 మందికి వివిధ ఉత్పత్తులపై శిక్షణ ఇప్పించగా, అందులో 150 మందికి ప్రత్యేకంగా ఆర్గానిక్ వ్యవసాయంపై శిక్షణ ఇప్పించటం జరిగిందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు ఎల్లప్పుడూ ముందుండేలా చర్యలు చేపడుతున్నామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల కంటే ముందుగానే జగ్గయ్యపేట నియోజకవర్గంలో యానిమల్ హాస్టల్స్ ప్రారంభించుకున్నట్లు తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లా ప్రజల్లో అవగాహన స్థాయి అధికంగా ఉందని, అందుకే కొత్త పథకాలు, వినూత్న కార్యక్రమాలకు మంచి స్పందన లభిస్తోందని అన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్గానిక్ వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించిందని, రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయ పద్ధతుల వైపు మళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటిస్తున్నారని తెలిపారు.ఎన్టీఆర్ జిల్లాలో అగ్రికల్చర్‌తో పాటు హార్టికల్చర్ రంగాల్లోనూ అధిక సంఖ్యలో రైతులు ఉన్నారని, ఆర్గానిక్ ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా మంచి గిరాకీ ఉందని అన్నారు. రైతులు సహజ పద్ధతులను అలవాటు చేసుకుంటే తమ ఉత్పత్తులను దేశమంతటా విక్రయించే అవకాశాలు విస్తరిస్తాయని వివరించారు. ఎన్టీఆర్ జిల్లా లో ఆర్గానిక్ వ్యవసాయం, హార్టికల్చర్ రంగాల్లో ముందంజలో నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకు సంబంధించి రైతుల కోసం ప్రత్యేక ఈ-పోర్టల్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ-పోర్టల్ ద్వారా ఆర్గానిక్ వ్యవసాయం చేసే రైతులు తమ ఉత్పత్తులను స్వయంగా మార్కెట్ చేసుకునే విధంగా వ్యవస్థను రూపకల్పన చేసినట్లు వివరించారు. రైతుకొనుగోలుదారుల మధ్య ఎటువంటి ఇబ్బందులు లేకుండా, సులభంగా లావాదేవీలు జరిగేలా ఈ డిజిటల్ వేదికను రూపొందించామని చెప్పారు. మధ్యవర్తులు లేకుండా రైతులకు నేరుగా మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం ఈ పోర్టల్ ముఖ్య లక్ష్యమన్నారు. ప్రస్తుతం కొద్దిమంది రైతులే ఆర్గానిక్ పద్ధతిలో పంటలు పండిస్తున్నందున ధరలు అధికంగా ఉన్నాయని, రైతుల సంఖ్య పెరిగి ఉత్పత్తి విస్తరించిన కొద్దీ ధరలు కూడా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కేశినేని ఫౌండేషన్ అందించే సాంకేతిక, మార్కెటింగ్ మద్దతుతో రైతులకు మెరుగైన లాభాలు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్గానిక్ ఉత్పత్తుల తయారీలో ఎన్టీఆర్ జిల్లా ముందంజలో నిలిచేలా కృషి చేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

## ఇటుక బట్టీల్లో ఛిద్రమవుతున్న పిల్లల జీవితం

**బడికి పోవాల్సిన సమయంలో బట్టీల మధ్య ఆటలు**

**కూలీల పిల్లలకు చదువులు చెప్పని వ్యాపార యాజమాన్యాలు**

**అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న బట్టి యజమానులు**

**ఆరోగ్యం అంతంత మాత్రమే**

**పిల్లల భవిత పై ఆందోళన వ్యక్తం చేస్తున్న మానవ హక్కుల, ప్రజాసంఘాలు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 22 ( వార్త సంధ్య):** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు పరిసర ప్రాంతాల్లో నడుస్తున్న ఇటుక



బట్టీల్లో చిన్నారుల జీవితం దయనీయంగా మారుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. బడికి వెళ్లి చదువుకోవాల్సిన వయస్సులో పిల్లలు ఇటుక బట్టీల మధ్య గడుపుతూ, ఆటలు ఆడుతూ లేదా తల్లిదండ్రులతో కలిసి పనిలో నిమగ్నమవుతున్న దృశ్యాలు స్థానికులను కలవరపెడుతున్నాయి. విద్య అనే ప్రాథమిక హక్కు దూరమవుతుండగా, చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇటుక బట్టీల వద్ద పని చేస్తున్న కూలీల కుటుంబాలు



తాత్కాలిక గుడిసెల్లో నివసించడంతో పిల్లలకు పాఠశాల వాతావరణం పూర్తిగా దూరమవుతోంది. సమీపంలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నప్పటికీ, వారిని పాఠశాలకు పంపించే విషయంలో యాజమాన్యాలు లేదా మధ్యవర్తులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా, చదువు మానేసిన పిల్లలు రోజంతా బట్టీల మధ్యే తిరుగుతూ కాలం గడుపుతున్నారు. ముఖ్యంగా వలస కూలీల పిల్లలు విద్యకు పూర్తిగా దూరమవుతున్న పరిస్థితి ఉందని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు.

### పిల్లల ఆరోగ్య భద్రత పట్టదా:

తల్లిదండ్రులు రోజంతా కష్టపడి పనిచేయాల్సి రావడంతో చిన్నారులపై ఎవరూ ప్రత్యేకంగా దృష్టి పెట్టలేకపోతున్నారు. కొంతమంది పిల్లలు చిన్నచిన్న పనుల్లో సహాయం చేస్తూ ఇటుకల కట్టలు దగ్గరే పెరుగుతున్నారని సమాచారం. ఇది బాల కార్మికత్వానికి దారితీసే ప్రమాదకర పరిస్థితిగా మానవ హక్కుల సంస్థలు పేర్కొం టున్నాయి. అదేవిధంగా, ఇటుక బట్టీల పరిసరాల్లో ఆరోగ్య పరిస్థితులు కూడా తీవ్రంగా దెబ్బతింటున్నాయి. దుమ్ము, పొగ, అధిక ఉష్ణోగ్రతల మధ్య చిన్నారులు ఎక్కువ సమయం గడపడం వల్ల శ్వాస సంబంధిత సమస్యలు, చర్మ వ్యాధులు, కళ్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సరైన పోషకాహారం, శుభ్రమైన తాగునీరు, వైద్య సదుపాయాలు లేకపోవడం వల్ల పిల్లల ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తున్నదని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.





### ప్రత్యేక విద్యా వైద్య, విధానం

ఇటుక బట్టీల వద్ద బాలల కోసం ప్రత్యేకంగా అంగన్‌వాడీ, క్రెచ్, లేదా విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ, అనేక చోట్ల అలాంటి సదుపాయాలు లేకపోవడం గమనార్హం. పిల్లల సంరక్షణపై వ్యాపార యాజమాన్యాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్మికుల సంక్షేమం పేరుతో ఎలాంటి చర్యలు చేపట్టకుండా కేవలం ఉత్పత్తి పై మాత్రమే దృష్టి పెడుతున్నారని విమర్శలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కూడా ఈ సమస్యను మరింత తీవ్రమయ్యేలా చేస్తోందని ప్రజాసంఘాలు అంటున్నాయి. బాలల హక్కులు, బాల కార్మిక నిషేధ చట్టాలు ఉన్నప్పటికీ, ఇటుక బట్టీల్లో పిల్లల పరిస్థితిపై రెగ్యులర్ తనిఖీలు జరగకపోవడం వల్ల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖలు సమగ్ర తనిఖీలు చేపట్టకపోవడం వల్ల చిన్నారుల విద్య, ఆరోగ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోందని విమర్శలు ఉన్నాయి.

### చిన్నారుల భవితవ్యంపై మానవ హక్కులు ప్రజాసంఘాల ఆందోళన

మానవ హక్కుల సంస్థలు, ప్రజాసంఘాలు పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బడికి వెళ్లాల్సిన వయస్సులో ఇటుక బట్టీల మధ్య పెరుగుతున్న ఈ చిన్నారులు భవిష్యత్తులో అక్షరాస్యత లేకుండా సమాజంలో వెనుకబడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విద్య లేకపోవడం వల్ల పేదరికం నుంచి బయటపడే అవకాశాలు తగ్గిపోతాయని వారు సూచిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ ఏది అంటూఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాలు ప్రభుత్వం, సంబంధిత శాఖలు వెంటనే జోక్యం చేసుకుని ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న కార్మికుల పిల్లల కోసం ప్రత్యేక విద్యా కార్యక్రమాలు, మొబైల్ స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే బాల కార్మికత్వాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, యాజమాన్యాల బాధ్యతను నిర్ధారించాలని కోరుతున్నారు. మొత్తానికి, ఇటుక బట్టీల మధ్య చిన్నారుల బాల్యం నెమ్మదిగా ఛిద్రమవుతున్న దుస్థితి వెలుగులోకి వస్తోంది. ఆటలు ఆడాల్సిన వయస్సులో దుమ్ము, పొగ మధ్య పెరుగుతున్న ఈ పిల్లల జీవితం, వారి ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు అన్నీ ప్రమాదంలో ఉన్నాయని ప్రజాసంఘాలు హెచ్చరిస్తున్నాయి. తక్షణ చర్యలు తీసు కోకపోతే ఒక తరం పిల్లల భవిష్యత్తు చీకటిలో కలిసిపోయే ప్రమాదం ఉందని మానవ హక్కుల కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఆదివారం రోజు సర్పంచ్ పామేన రాములు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు.



**చేవెళ్ల,ఫిబ్రవరి 22 ( వార్త సంధ్య):** ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు



ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. తంగడపల్లి మజీద్ వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు దీక్ష విడిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇఫ్తార్ విందులలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలోని కులమతాలకు అతీతంగా గ్రామ పెద్దలు ముస్లిం యువకులు తదితరులు పాల్గొన్నారు...

# 20 వేల కోసం 70 లక్షల ప్లాంట్ బొక్క..

గత మూడేళ్లుగా టెక్నీషియన్ లేక ఆక్సిజన్ ప్లాంట్ కు పట్టిన చెదలు..



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22 - ( వార్త సంధ్య ) -మదనపల్లి :-** తంబళ్లపల్లె నియోజకవర్గం పరిధిలోని బి. కొత్తకోట నగర పంచాయతీ కేంద్రమైన స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్ సీ) నందు గత వైసీపీ ప్రభుత్వ పాలనలో కోవిడ్ మహమ్మారి విజృంభించిన సమయం లో రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, తంబళ్లపల్లి శాసనసభ్యుల పెద్దిరెడ్డి ద్వారకారునాథ్ రెడ్డి సహకారంతో ఎంపీ ల్యాడ్స్ నుంచి 70 లక్షల రూపాయల నిధులను వేచించి కోవిడ్ బాధితుల కొరకు ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కానీ దానికి తగ్గట్టు సరైన టెక్నీషియన్ ను నియమించలేని కారణంగా ప్లాంటును ఆక్సిజన్ ఉత్పత్తి చేయడం లేదు. కూటమి ప్రభుత్వ పాలన నుంచి ఆక్సిజన్ ఉత్పత్తి కావడం లేదు. 70 లక్షల ప్రజాధనం దుర్వినియోగమవుతున్న అత్యవసరమయిన ఆక్సిజన్ ప్రజలకు అందించడంలో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. ఇకనైనా దీనిపై ఆరోగ్యశాఖ స్పందించి కూటమి ప్రభుత్వ చొరవతో అక్సిజన్ ప్లాంట్ నడిచే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు..

# ప్రజల అప్రమత్తత తో తప్పిన పెను ప్రమాదం..

సకాలంలో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు..



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22 - ( వార్త సంధ్య ) -మదనపల్లి :-** మదనపల్లెలో పెను ప్రమాదం తప్పింది. ఓ లారీ వేగంగా వచ్చి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఆ దెబ్బకు విద్యుత్ స్తంభమే విరిగి చల్లా చెదురైంది. స్థానికులు వెల్లడించిన కథనం మేరకు మదనపల్లె పట్టణ పరిధిలోని నీరుగట్టువారిపల్లి లో గల మార్కెట్ యార్డ్ సమీపంలో ఆదివారం బెంగళూరు నుంచి కడప వైపు వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పి రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో స్తంభం విరిగి రోడ్డుపై పడింది. విద్యుత్ తీగలు చెల్లాచెదురయ్యాయి. హై టెన్షన్ వైర్లు ఉండడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. కొద్దిసేపు ట్రాఫిక్ ఆగిపోయింది. ప్రమాద సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. వాహన రాకపోకలు కొనసాగుంటే ప్రాణనష్టమే వాటిల్లేది. స్థానిక ప్రజల సమయస్ఫూర్తితో లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. రద్దీ ప్రాంతంలో ఈ ప్రమాదం జరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరాను నిలిపివేసి అక్కడికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. ప్రజల అప్రమత్తతతో పెద్ద ముప్పు తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు..

# వెంకట తండా క్రికెట్ టోర్నమెంట్ 2 విజయవంతం



**టేకులపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 22: (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, టేకులపల్లి మండలం, బేతంపూడి గ్రామపంచాయతీ లో వెంకటయ్య తండా గ్రామ యువకులు నిర్వహించిన మండల స్థాయి లో వెంకటయ్య తండా క్రికెట్ టోర్నమెంట్ 2 విజయవంతంగా నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ లో దాదాపు 40 టీంలు పాల్గొన్నారు. ఫైనల్ లు సంపత్ నగర్ టీం మీద నైన్త్ మెయిల్ తండ టీం విజయం సాధించింది. విపిఎల్ సీజన్ 2 విన్నర్ అశోక్ కు విజయం వరించింది. రెండవ బహుమతి సంపత్ నగర్ టీం రన్నర్ గా నిలిచింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గూగులోత్ చంటి బెస్ట్ బ్యాట్ మాన్ సందీప్ మ్యాచ్ స్పాన్సర్స్ రిమ్స్ హాస్పిటల్ రెండవ పన్సర్ నరేష్ మోతిలాల్ శంకర్ ట్రేడర్స్ నిర్వాహకులు పవన్ చందు తరుణ్ చోటు క్రాంతి లాల్ గ్రాండ్ దాత భాస్కర్ వీరందరి సహకారంతో టోర్నమెంట్ విజయం సాధించింది. ఈ కార్యక్రమం కు సర్పంచ్ సునీత మాట్లాడుతూ ఆటలు యువతలో మంచి క్రమశిక్షణను ఐక్యమత్యాన్ని పెంపొందించడం తో పాటు శారీరకంగా దృఢత్వాన్ని కలిగి మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఉకే సునీత, గ్రామ పెద్దలు లక్పతి , హేమ్లు, లచ్చిరాం ,బానోత్ లక్ష్మ, శ్రీను, నరేష్, హుస్సేన్, పాల్గొన్నారు.

# కృత్రిమ మేదస్సు వరమా శాపమా

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ) పై సామాజిక కార్యకర్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు స్పందన



**కృష్ణాజిల్లా ,బ్యూరో ఫిబ్రవరి 22, వార్త సంధ్య) :** ప్రస్తుతం ప్రపంచం ఒక కొత్త సాంకేతిక విప్లవాన్ని చూస్తుందని సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు అన్నారు ఆదివారం ఆయన తన కార్యాలయంలో కృత్రిమ మేధస్సు పై తన అభిప్రాయాలను మీడియాతో పంచుకున్నారు. మనిషి ఆలోచనలను అనుకరించే ఈ సాంకేతికత విద్య వైద్యం వ్యవసాయం బ్యాంకింగ్ ప్రభుత్వ పరిపాలన వంటి అనేక రంగాల్లో విస్తృత మార్పులు తీసుకొస్తుందని పేర్కొన్నారు.

AI వలన భారీ డేటాను సైతం క్షణాల్లో విశ్లేషించి సరైన నిర్ణయాలు తీసుకోవచ్చని తెలిపారు వైద్యరంగంలో సూచనలు, వ్యవసాయ రంగంలో రైతులకి వాతావరణ సూచనలు ఇవ్వడం విద్యార్థులకు వ్యక్తిగత అవసరాలకు సరిపోయి పాఠ్య విధానాన్ని అందించటం ప్రభుత్వ సేవలో పారదర్శకత పెరిగి అవినీతి తగ్గే అవకాశం ఉందన్నారు. ఇవన్నీ సానుకూల మార్పులుగా పేర్కొన్నారు. ప్రతి అభివృద్ధికి ఒక బాధ్యత ఉంటుందని, డేటా గోప్యతకు ముప్పు పెరగకుండా, ఫేక్ వీడియోలు, సైబర్ మోసాలు వంటి నూతన నేరాలు సమాజానికి సవాలుగా మారకుండా చూడవలసిన బాధ్యత ఉందన్నారు. టెక్నాలజీ పై పూర్తిగా ఆధారపడితే మానవ విలువలు నైతికత ప్రభావితమయ్యే అవకాశం ఉందన్నారు. కృత్రిమ మేధస్సునీ ఆపటం కన్నా నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు .

ప్రభుత్వం బలమైన డేటా రక్షణ చట్టాలు అమలు చేయాలని, విద్యా వ్యవస్థలో డిజిటల్ అవగాహన పెంచాలని, యువత కృత్రిమ మేధస్సు నేర్చుకొని ఉపాధి అవకాశాలుగా మలుచుకునేలా చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువతకు సాంకేతిక శిక్షణ అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో సాంకేతిక అసమానత పెరిగి సామాజిక అంతరం మరింత విస్తరించే ప్రమాదం ఉందన్నారు. కృత్రిమ మేధస్సు మనిషిని భర్తీ చేయటానికి కాదనీ మనిషి సామర్థ్యాన్ని పెంచడానికి దోహదపడాలన్నారు.మానవత్వం ముందు సాంకేతికత తర్వాతగా ఉండాలన్నారు. సమతుల్య విధానాలతో బాధ్యతాయుత వినియోగంతో కృత్రిమ మేధస్సును సమాజ సేవకు ఉపయోగించుకున్నప్పుడే సుస్థిర అభివృద్ధికి మార్గం ఏర్పడుతుందన్నారు.

# ఘనంగా కేజీబీవీలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు..

మన మాతృ భాషను మరచిపోతే మన కన్నతల్లిని మరచినట్లే.. నిర్మల

**అన్నమయ్య జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22 - ( వార్త సంధ్య) - మదనపల్లి :-** స్థానిక నియోజకవర్గ పరిధిలోని కురబలకోట మండల కేంద్రమైన స్థానిక కేజీబీవీలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నామని తెలుగు భాషోపాధ్యాయుని నిర్మల తెలిపారు. కేజీబీవీలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్కడ చదువుతున్న విద్యార్థినీలు తెలుగుదనం ఉట్టిపట్టేలా సాంప్రదాయ దుస్తులలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో పాలుపంచుకుంటూ కేజీబీవీ తెలుగు భాషోపాధ్యాయుని తలపెట్టిన వివిధ కవితల పోటీలు, పద్యాపఠన పోటీలు, కథల పోటీల నిర్వహణ మరియు ఆట పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థినీలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా తెలుగు భాషోపాధ్యాయుని నిర్మల మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి ప్రధాన విభాగం యునెస్కో 1999 లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. నాటి పాకిస్థాన్ లో బెంగాలీలు 1952లో తమ మాతృభాష బెంగాలీ పరిరక్షణ కోసం చేసిన పోరాటానికి గుర్తుగా బంగ్లాదేశ్ ప్రతిపాదన మేరకు ఈ తేదీ ఖరారైందని యునెస్కో విద్యాబోధనలో కనీసం మూడు భాషలు గల మాతృభాష, జాతీయ భాష, అంతర్జాతీయ



భాషలకు చోటుండాలని 1999 నుంచి ప్రచారం చేయడం ఆరంభించిందని పిల్లలు పసిప్రాయంలో మాతృభాష తరువాత మిగిలిన రెండు భాషలు నేర్చుకుంటే వారి జీవితం సాఫీగా సాగిపోతుందన దానిపై ప్రతిపాదన చేసింది. చిన్న పిల్లల మానసిక ఆరోగ్యానికి వారి మాతృభాషతో సంబంధం ఉందని పరిశోధకులు తేల్చారు. పుట్టిన దగ్గర నుంచి మాతృభాష ధ్వనులు వింటుండడం వల్ల వారిపై ప్రభావం చూపుతాయని మాతృభాషలో మాట్లాడలేని పిల్లల్లో చురుకుదనం తక్కువగా ఉంటుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. అమ్మపాలు, అమ్మభాష లకు ఏవీ సాటిరావు. ఎదుగుదలకు అభివృద్ధికి మాతృభాష ఎంతగానో తోడ్పడుతుంది. గ్లోబలైజేషన్ నేపథ్యంలో కొన్ని భాషలకే అధిక ప్రాధాన్యం లభిస్తుంటం వలన రాబోయే కాలంలో వందలాది భాషల ఉనికి అంతరించిపోయే ప్రమాదం కనబడుతోంది. గనుక మనందరం మన మాతృభాష ఉనికిని మనం కాపాడుకోవాలి. మన భాషా సంస్కృతి వారసత్వాన్ని నిలబెట్టుకునేందుకు మనలో ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి. మన మాతృ భాషను మరచిపోతే మన కన్నతల్లిని మరచినట్లేననే భావనకు రావాలి. ఈ రోజుల్లో ఉద్యోగ వ్యాపారాల నిమిత్తం ఇతర రాష్ట్రాలలో, విదేశాల్లో స్థిరపడిపోతున్నారు. పిల్లలు తమ మాతృభాషకు దూరమవుతున్నారు. మనమే మన పిల్లలకు చిన్నతనం నుంచే మన మాతృభాష మాధుర్యం మమకారం వారికి నేర్పుతుండాలి. రాయడం, చదవడం నేర్పాలి. ఆధునిక నాగరికత మోజులో పడిపోయి మన మాతృభాషను నిర్లక్ష్యం చేయడం తగదు. యునెస్కో కూడా ఇదే సూచిస్తోంది. మన మాతృభాషను కాపాడుకోవలసిన బాధ్యత మనదే. అందరికీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుభాకాంక్షలంటూ నిర్మల పేర్కొన్నారు..

# సినీ నటి అనుపమ పరమేశ్వరన్ ప్రారంభించిన వైశ్య రాజు జ్యువెలర్స్



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 22:** చైతన్యపురి దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై 'వైశ్య రాజు జ్యువెలర్స్ నూతన షోరూమ్‌ను అదివారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినీ నటి అనుపమ పరమేశ్వరన్ నిర్వాహకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌నుఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ ఆభరణాలు భారతీయ సంస్కృతిలో ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయని, మహిళల అందాన్ని మరింత మెరుగు పరచడంలో నగల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. విశ్వసనీయత, నాణ్యత, వినియోగదారుల నమ్మకం ఇవే ఒక ఆభరణాల సంస్థ విజయానికి మూలాధారాలని పేర్కొన్నారు. వినియోగదారులకు విశ్వాసంతో పాటు అందుబాటు ధరల్లో ఉత్తమ నాణ్యత గల నగలను అందించాలని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. షోరూమ్‌లో బంగారం, వెండి ఆభరణాలతో పాటు ఆధునిక డిజైన్ల కలెక్షన్లు అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి వర్గానికి తగిన రీతిలో ప్రత్యేక ఆఫర్లు, ప్రారంభోత్సవ రాయితీలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.ప్రారంభోత్సవ వేడుకకు స్థానిక వ్యాపారవేత్తలు, ప్రముఖులు, వినియోగదారులు పెద్ద సంఖ్యలో హాజరై అభినందనలు తెలిపారు. కొత్త షోరూమ్‌తో దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో ఆభరణాల రంగానికి మరింత ఉత్సాహం చేకూరుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# సర్వీస్ రోడ్డును పరిశీలించిన హయత్‌నగర్ మాజీ కార్పొరేట్ నవజీవన్ రెడ్డి




**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 22:** హయత్ నగర్ బస్ డిపో వెళ్ళు మార్గంలో జాతీయ రహదారికి అనుగుణంగా ఉన్న సర్వీస్ రోడ్డు మరియు అనుసంధాన కాలనీ లింక్ రోడ్లకు నిర్మిస్తున్న బీటీ రోడ్ల పనులను స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, హయత్ నగర్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం అత్యంత అవసరమని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణకు అనుగుణంగా సర్వీస్ రోడ్లు మరియు కాలనీ లింక్ రోడ్లు బలమైన బీటీ రోడ్లుగా నిర్మించబడటం వల్ల స్థానిక ప్రజలకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడుతుందని అన్నారు. ప్రత్యేకంగా హయత్ నగర్ బస్ డిపో పరిసర ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి మెరుగుపడితే ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు వ్యాపార కార్యకలాపాలు కూడా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. అలాగే ఇదే విధంగా అన్ని లింక్ రోడ్లను కూడా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా బీటీ రోడ్లుగా నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ, ప్రజల అవసరాలే తమ ప్రాధాన్యత అని, ఎల్లప్పుడూ ప్రజలతో కలిసే అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా తేలిపారు.

# బి.ఎన్.రెడ్డి మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిని సన్మానించిన శ్రీ పద్మావతి బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ సంక్షేమ సంఘం



**హయత్‌నగర్ ప్రతినిధి, వార్త సంధ్య, ఫిబ్రవరి 22:** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ పద్మావతి బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ అభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసినందుకు మరియు 5 సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేటర్ గా 5 సంవత్సరాలు పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా మరియు కాలనీ అభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి కిషన్, ఉపాధ్యక్షులు సుభాష్,కిరణ్, ప్రసాద్, శ్రీకాంత్,నరేష్ మరియు పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా ప్రజాభివందనం




**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 22:** హయత్ నగర్ పాత గ్రామంలో స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ని కాస్ బాగ్ గ్రామ యువత ఘనంగా సన్మానించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఒక్కచోట చేరి శాలువాలు, గజమాలతో సత్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండి స్పందించడం, గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడం, అవసరమైన సమయంలో ప్రతి ఒక్కరికీ అండగా నిలవడం వంటి సేవలను గుర్తిస్తూ ఈ సన్మానం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి పట్ల ఆయన చూపిన నిబద్ధతకు కృతజ్ఞతగా ప్రజలు తమ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ,"ఎలక్షన్స్ సమయంలో మాత్రమే పార్టీలు ఉంటాయి. ఎన్నికలు పూర్తయ్యాక మనమందరం ఒకే కుటుంబ సభ్యులం. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలి" అని అన్నారు. ప్రజల విశ్వాసమే తనకు గొప్ప బలం అని, ఎప్పటికీ అందుబాటులో ఉంటూ హయత్ నగర్ పాత గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీలకతీతంగా వ్యక్తమైన ఈ ప్రజాభివందనం ఆయనపై గ్రామ ప్రజలకు ఉన్న ప్రేమ, నమ్మకానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ గ్రామస్తులు బండారి భాస్కర్, ఉగాది ఎల్లప్ప,చెన్నగౌని రవీందర్ గౌడ్, చెన్నగౌని శ్రీధర్ గౌడ్, నడిగొట్టి స్వామి, జెల్ల నర్సింహా,జగదీష్, నరేష్ గౌడ్,శివ, చంటి,బాలు, వినోద్, సాయి గౌడ్, శివ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన - గడికోట శ్రీకాంత్ రెడ్డి

గ్రామాల్లోని ఆలయాలు గ్రామ ప్రజల ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీక..



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22 - ( వార్త సంధ్య ) :** రామాపురం మండల కేంద్రమైన సుద్దమల్ల గ్రామం ఓబుల్ రెడ్డిగారిపల్లె దిగువ హరిజనవాడలో నిర్మాణ దశలో ఉన్న శ్రీ సీతా సమేత కోదండ రామాలయాన్ని ఆదివారం స్థానిక ప్రజలతో కలిసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షల నిధులను మంజూరు చేయించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను పరిశీలించిన గడికోట శ్రీకాంత్ రెడ్డి నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా త్వరతగతిన పూర్తి చేయాలని మేస్త్రీకి సూచించారు. గ్రామాల్లోని ఆలయాలు పల్లె వాతావరణానికి గ్రామ ప్రజల ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీకనని ఆయన పేర్కొన్నారు.

## దిగువ హరిజనవాడ వాసులతో శ్రీకాంత్ రెడ్డి మమేకం..

సొంత గ్రామంలోని దిగువ హరిజనవాడకు విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డికి దళితులు ఘన స్వాగతం పలికారు. పెద్దలు, యువత, మహిళలు హర్షధ్వానాలతో స్వాగతించారు. యువత కేరింతలు కొడుతూ డప్పులు వాయిస్తూ పూలు పరుస్తూ పూలహారాలతో గజమాలతో ఆయనను ఆహ్వానించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరిని పేరుపేరునా పలకరిస్తూ, వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ మమేకమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక దళితులు మాట్లాడుతూ గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం తమ అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేసిందని గుర్తుచేశారు. గ్రామంలోని ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం పట్ల శ్రీకాంత్ రెడ్డి కి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నిల్వ, కుళ్ళిన మాంసం అమ్మకాలు!

దందా కొనసాగు తోందని సమాచారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల ప్రకారం, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) ట్రేడ్ లైసెన్సులు జారీ చేసినప్పటికీ, ఆ తర్వాత షాపులపై పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఈ అక్రమ విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "లైసెన్స్ ఇచ్చిన తర్వాత తనిఖీలు చేయరా?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నిల్వ మాంసం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ కోళ్లతో పాటు గుర్తుతెలియని కేంద్రాల నుంచి తెచ్చిన కోళ్ల బొక్కలు, స్కిన్ తొలగించిన ముక్కలు, నిల్వ మాంసాన్ని స్కిన్లెస్ పేరుతో విక్రయిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పరిశుభ్రత ప్రమాణాలు పాటించకుండా, చల్లని నిల్వ సదుపాయాలు లేకుండా రోజుల తరబడి ఉంచిన మాంసాన్ని వినియోగదారులకు అందిస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారం పై సమాచారం అందుకున్న వార్తా సంధ్య మరియు తొలివార్త స్పెషల్ ఎడిషన్ ప్రతినిధులు నాగోల్ నుంచి జైపూర్ కాలనీకి వెళ్లి "రెడ్డి చికెన్ మార్కెట్" అనే షాపును పరిశీలించగా, అక్కడ నిల్వ ఉంచిన చికెన్ విక్రయాలు జరుగుతున్నట్లు ప్రత్యక్షంగా గమనించినట్టు తెలిపారు. నిల్వ మాంసం ఉండగా కూడా విక్రయం కొనసాగించడం చూసి ప్రతినిధులు వెంటనే 100 నంబర్‌కు కాల్ చేసి ఉప్పల్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడ ఉన్న చికెన్ నిల్వలను పరిశీలించి, ఫోటోలు, వీడియోలు సేకరించినట్లు సమాచారం. షాప్ యజమాని మరియు అక్కడ పని చేస్తున్న సిబ్బందిపై ఫిర్యాదుదారుల అభ్యర్థన మేరకు విచారణ చేపట్టినట్లు తెలిసింది. నిల్వ మాంసం నిల్వ విధానం, మూలాలు, సరఫరా వివరాలపై కూడా దర్యాప్తు జరుగుతున్నట్లు సమాచారం. స్థానిక వ్యాపార వర్గాల సమాచారం ప్రకారం, ఈ నిల్వ చికెన్‌ను కేవలం షాపుల్లోనే కాకుండా వైన్ షాపుల వద్ద ఉండే చికెన్ పకోడీ స్టాళ్లు, ప్రధాన రహదారుల పక్కనున్న ఫుడ్ స్టాళ్లు, వాణిజ్య సముదాయాల వద్ద ఉన్న భోజన కేంద్రాలలో కూడా సరఫరా చేస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తక్కువ ధరకు అందించే ఈ మాంసాన్ని కొందరు స్టాల్ యజమానులు కొనుగోలు చేసి వినియోగదారులకు విక్రయిస్తున్నట్టు సమాచారం.








## కొరవడిన అధికారుల పర్యవేక్షణ:

ఫుడ్ సేఫ్టీ అధికారులు, పశు వైద్య శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, అలాంటి పర్యవేక్షణ కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మాంసం విక్రయాలపై పశు వైద్య నిపుణుల సర్టిఫికేషన్ తప్పనిసరి అయినప్పటికీ, చాలా చోట్ల ఎటువంటి పరిశీలన లేకుండానే మాంసం మార్కెట్‌లోకి వస్తోందని స్థానికులు చెబుతున్నారు.

## ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

ఇది ప్రజా ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాద సంకేతమని నిపుణులు పేర్కొంటున్నారు. నిల్వ మాంసాన్ని ఐస్ నీటిలో రెండు గంటలు నానబెడితే అది సాధారణ స్థితికి వచ్చినట్టు కనిపిస్తుందని, కానీ కొద్ది గంటల్లోనే దుర్వాసన రావడం ప్రారంభమవుతుందని వ్యాపార వర్గాలే అంగీకరిస్తున్నాయి. వినియోగదారులకు అనుమానం రాకుండా ఉండేందుకు ఫ్రెష్ చికెన్‌లో కలిపి విక్రయిస్తున్నట్టు సమాచారం. ఈ విధానం పూర్తిగా ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆహార భద్రత నిపుణుల ప్రకారం, నిల్వ ఉంచిన లేదా కుళ్లిన చికెన్‌లో ప్రమాదకర బ్యాక్టీరియా వేగంగా పెరుగుతాయి. అలాంటి మాంసం వినియోగం వల్ల ఫుడ్ పాయిజనింగ్, కడుపు ఇన్ఫెక్షన్లు, విరేచనాలు, వాంతులు, జ్వరం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు వంటి వర్గాలకు ఇది మరింత ప్రాణాంతకమని వారు పేర్కొంటున్నారు. ప్రజలు కూడా తమ ఆందోళన వ్యక్తం చేస్తూ, "రోజూ కుటుంబాలకు కొనుక్కొని వెళ్లే చికెన్ సురక్షితమా కాదా అన్న భయం కలుగుతోంది. అధికారులు ఒక్కసారైనా ఆకస్మిక తనిఖీలు చేస్తే ఇలాంటి అక్రమాలు బయటపడతాయి" అని అభిప్రాయ పడుతున్నారు. లైసెన్స్ జారీ చేయడమే కాకుండా, పరిశుభ్రత ప్రమాణాలు, నిల్వ విధానం, మాంసం నాణ్యతపై నిరంతర తనిఖీలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారం ఇలాగే కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖలు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక దాడులు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నాణ్యత లేని మాంసం విక్రయించే షాపులను సీజ్ చేసి, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఇటువంటి నిల్వ మాంసం దందాను అరికట్టేందుకు వెంటనే సమగ్ర తనిఖీలు చేపట్టి, పారదర్శక వ్యవస్థను అమలు చేయాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. లేకపోతే లాభాల కోసం జరుగుతున్న ఈ అక్రమాలు పెద్ద ప్రజా ఆరోగ్య సంక్షోభానికి దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన కుళ్ళిన చికెన్ తింటే వచ్చే వ్యాధులు ప్రాణహాని... ?



వైద్య నిపుణుల హెచ్చరిక ప్రకారం, ఫ్రిజ్‌లో ఎక్కువకాలం నిల్వ ఉంచిన లేదా కుళ్లడం ప్రారంభమైన చికెన్ మాంసం బయటకు సాధారణంగా కనిపించినప్పటికీ, అందులో ప్రమాదకరమైన సూక్ష్మజీవులు వేగంగా పెరుగుతాయి. ముఖ్యంగా సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయకపోతే, ఫ్రిజ్‌లో పెట్టిన మాంసం కూడా పూర్తిగా సురక్షితం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.ఇలాంటి నిల్వ మాంసం తినడం వల్ల ముందుగా ఫుడ్ పాయిజనింగ్ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, జ్వరం వంటి లక్షణాలు కొన్ని గంటలలోనే ప్రారంభమవుతాయి. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఈ ప్రభావానికి ఎక్కువగా గురయ్యే ప్రమాదం ఉంటుంది. అలాగే కుళ్లిన చికెన్‌లో సాల్మోనెల్లా, ఈ-కోలై వంటి ప్రమాదకర బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంది. ఇవి శరీరంలోకి వెళ్లిన తర్వాత తీవ్రమైన పేగు ఇన్ఫెక్షన్లు, గ్యాస్ట్రోఎంటరైటిస్, డీహైడ్రేషన్ వంటి సమస్యలకు దారితీస్తాయి. తీవ్రమైన సందర్భాల్లో రోగిని ఆసుపత్రిలో చేర్చాల్సిన పరిస్థితి కూడా ఏర్పడుతుంది. నిల్వ మాంసంలో ఏర్పడే టాక్సిన్లు (విష పదార్థాలు) వండిన తర్వాత కూడా పూర్తిగా నశించకపోవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అందువల్ల దుర్వాసన రాకపోయినా, ఫ్రెష్ మాంసంలో కలిపి వండినా ఆరోగ్యానికి హానికరమే. దీని ప్రభావంగా




తల తిరగడం, బలహీనత, బీపీ పడిపోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. దీర్ఘకాలంగా నిల్వ ఉంచిన చికెన్ తినడం వల్ల టైఫాయిడ్, తీవ్రమైన ఆహార సంబంధిత ఇన్ఫెక్షన్లు, కడుపు పుండ్లు వంటి సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరింత ప్రమాదకర పరిస్థితుల్లో రక్తంలో ఇన్ఫెక్షన్ (సెప్టిసీమియా), కిడ్నీ సమస్యలు, శరీర అవయవాలపై దుష్ప్రభావం ఏర్పడి ప్రాణహాని సంభవించే ప్రమాదం కూడా ఉంటుంది. పశువైద్య నిపుణుల ప్రకారం, సరైన వెటర్నరీ పరిశీలన, ఫుడ్ సేఫ్టీ తనిఖీలు లేకుండా మార్కెట్‌లోకి వచ్చే నిల్వ మాంసం ప్రజా ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు. రెండు మూడు రోజులు ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి మళ్లీ విక్రయించే మాంసంలో బ్యాక్టీరియా స్థాయి మరింత పెరిగి, ఆహార విషబాధకు ప్రధాన కారణంగా మారుతుంది. ప్రజలు చికెన్ కొనుగోలు చేసే సమయంలో రంగు మారిన మాంసం, దుర్వాసన, అతిగా నారగా ఉండటం, ఐస్‌లో ఎక్కువసేపు నానబెట్టినట్లు కనిపించడం వంటి లక్షణాలను గమనించాలని నిపుణులు సూచిస్తున్నారు. అనుమానాస్పద మాంసాన్ని వినియోగించడం వల్ల తక్షణ ఆరోగ్య సమస్యలతో పాటు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు కూడా ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అందువల్ల నిల్వ ఉంచిన, కుళ్లిన లేదా ఎక్స్పైరీ చికెన్ విక్రయాలపై కఠిన తనిఖీలు నిర్వహించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్య, ప్రజారోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# పవన్ కల్యాణ్ దత్తత గ్రామం కొణిదెలకు కొత్తదశ

**రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు**

**2019 ఎన్నికల సమయంలో గ్రామంలో పవన్ పర్యటన**

**నాడు సమస్యలను విని పరిష్కరిస్తానని పవన్ హామీ**

**రూ.50 లక్షలతో 90 వేల లీటర్ల రక్షిత తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం**



ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామానికి మహర్దశ పట్టింది. పవన్ కల్యాణ్ ఇంటి పేరు, ఆ ఊరి పేరు "కొణిదెల" కావడం విశేషం. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో ఉండగా అక్కడ సమస్యలను స్థానికులు పవన్ దృష్టికి తెచ్చారు. తన ఇంటి పేరుతో ఉన్న కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటానని పవన్ వారికి హామీ ఇచ్చారు. 2025లో నందికొట్కూరు నియోజకవర్గంలో ఫారం పాండ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్లిన సందర్భంలో కొణిదెల గ్రామాభివృద్ధికి రూ.50 లక్షల విరాళం అందించారు. జిల్లా యంత్రాంగం సూచన మేరకు ఆ నిధులతో 90 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్ హెడ్ నీటి ట్యాంకు నిర్మించారు. దీంతో పాటు పల్లెపండుగ 1.0, పల్లెపండుగ 2.0, సాస్కీ, గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ తదితర పథకాల ద్వారా వచ్చిన నిధులతో రోడ్లు, డ్రెయిన్లు, కాలువల అభివృద్ధి, గోకులాలు, ఇళ్ల నిర్మాణం తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. కేవలం ప్రభుత్వ పథకాల నుంచే ఇప్పటివరకు సుమారు రూ.6 కోట్లకు పైగా నిధులు కొణిదెల గ్రామాభివృద్ధికి వెచ్చించారు. గ్రామానికి అవసరం ఉన్న అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు.గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.50 లక్షలతో 90 వేల లీటర్ల రక్షిత తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. దీని వల్ల ఆ గ్రామ పరిధిలో 2 వేల మంది దాహార్తి తీరనుంది. వేసవికి ముందే ట్యాంక్ నిర్మాణం పూర్తి కావడంపై పవన్ ఆనందం వ్యక్తం చేశారు. సకాలంలో నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరించిన అధికారులను అభినంది ంచారు.కొణిదెల గ్రామానికి 'పల్లె పండుగ 1.0'లో రూ.20 లక్షలకు పైగా వెచ్చింది 3 అంతర్గత రోడ్లు నిర్మించారు. 'పల్లె పండుగ 2.0'లో రూ.45 లక్షలతో చేపట్టిన 7 సీసీ రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి.ఉప ప్రణాళిక నిధులతో స్థానిక జిల్లా పరిషత్తు స్కూల్ నుంచి పగిడ్యాల మండల పరిధిలోని లక్ష్మాపురం వరకు 5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గ్రామం వరకు రోడ్డు పునరుద్ధరణకు రూ.45 లక్షలు డిప్యూటీ సీఎం పవన్ మంజూరు చేయించారు.కొణిదెల గ్రామస్థుల అభ్యర్థన మేరకు 4 గోకులాలు, గృహ నిర్మాణ శాఖ సహకారంతో 19 ఇళ్లు, నీటి తొట్టెలు నిర్మించారు.జాతీయ ఉపాధి హామీ పథకం కింద రైతుల కోసం 49 ఫీడర్ ఛానళ్లు అభివృద్ధి చేశారు.2 చిన్న కాలువల పునరుద్ధరణ, 3 కమ్యూనిటీ చెక్‌డ్యాంలు బాగు చేశారు.

# జగిత్యాల జిల్లాలో అనుమానాస్పద స్థితిలో కాలువలో శవమై తేలిన బీజేపీ నాయకుడు

**జిల్లాలోని పెగడపల్లి మండలం**

**సుద్దపల్లిలో విషాదం**

**ఇటీవల సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి**

**స్వల్ప ఓట్లతో ఓడిపోయిన రమణారెడ్డి**

**ప్రమాదమా లేక హత్యనా అనే కోణంలో**

**పోలీసుల దర్యాప్తు**



జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం సుద్దపల్లిలో బీజేపీ నాయకుడు రమణారెడ్డి అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓడిపోయారు. గతంలో ఆయన బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా పని చేశారు. మూడు రోజుల క్రితం ఆయనకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది.రమణారెడ్డి ప్రయాణిస్తున్న బ్రెజ్జా కారు ఎస్సారెస్పీ కాలువలో పడటంతో ఆయన మృతి చెందాడు. ఆయన ఇటీవల క్రిప్టో కరెన్సీతో భారీగా నష్టపోయాడు. మూడు రోజులుగా ఆయన కనిపించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఆయన కారును ఎస్సారెస్పీ కాలువలో గుర్తించి వెలికి తీయగా అందులో రమణారెడ్డి మృతదేహాన్ని ఉంది. ప్రమాదవశాత్తు కారు అందులో పడిందా లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఆయన 18వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారని, దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా ఈ ప్రాంతాన్ని దాటి అతను బయటకు వెళ్లినట్లుగా ఎక్కడా లేదన్నారు. దీంతో ఇదే ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా ఈరోజు ఉదయం కాలువలో పడినట్లు గుర్తించామని అన్నారు.కారును వెలికితీయగా రమణ మృతదేహం లభ్యమైందన్నారు.

# ఎమ్మెల్సీ అనంతబాబు కేసులో కీలక పరిణామం

**అప్పటి డీఎస్పీ సహా నలుగురిపై సస్పెన్షన్**

**అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో నలుగురు పోలీసులపై వేటు**

**సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం చర్యలు**

**నిందితుడికి సహకరించారన్న ఆరోపణలతో సస్పెన్షన్**

**అప్పటి డీఎస్పీ భీమారావు సహా నలుగురు అధికారుల సస్పెన్షన్**



రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వైసీపీ ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయ భాస్కర్ రావు (అనంతబాబు) డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. దర్యాప్తులో పోలీసుల తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో, ఈ కేసుతో సంబంధం ఉన్న నలుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.2022లో జరిగిన ఈ హత్య కేసు దర్యాప్తులో నిందితుడైన అనంతబాబుకు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై ఈ వేటు పడింది. ఈ కేసు విచారణ "పోలీసు-అధికార వర్గాల కుమ్మక్కుకు స్పష్టమైన ఉదాహరణ" అని ఫిబ్రవరి 20న భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఛార్జిషీట్ దాఖలులో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసి, నిందితుడికి డిఫాల్ట్ బెయిల్ వచ్చేలా పోలీసులు సహకరించారని కోర్టు అభిప్రాయపడింది. ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే ప్రభుత్వం తక్షణమే స్పందించి, బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేసింది.

**కేసు నేపథ్యం ఏమిటి?**

2022 మే 19న కాకినాడలో అనంతబాబు డ్రైవర్, దళిత యువకుడైన వీధి సుబ్రహ్మణ్యం (34) మృతదేహం అనుమానాస్పద స్థితిలో లభ్యమైంది. అప్పు విషయంలో జరిగిన చిన్న గొడవలో ప్రమాదవశాత్తు చనిపోయాడని మొదట చిత్రీకరించే ప్రయత్నం జరిగింది. అయితే, ప్రజాసంఘాల ఆందోళనలతో అనంతబాబుపై హత్య (సెక్షన్ 302), సాక్ష్యాల ధ్వంసం (సెక్షన్ 201), ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కానీ, దర్యాప్తులో జాప్యం కారణంగా 2022 డిసెంబర్‌లో ఆయన డిఫాల్ట్ బెయిల్‌పై విడుదలయ్యారు. అప్పట్లో పెరిగిన ప్రజా వ్యతిరేకతతో వైసీపీ ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. ఫోరెన్సిక్, సీసీటీవీ, డిజిటల్ ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన సిట్, ఇది ప్రమాదం కాదని, పక్కా ప్రణాళికతో జరిగిన హత్య అని నిర్ధారిస్తూ అనంతబాబు, ఆయన భార్య లక్ష్మీ దుర్గలను ప్రధాన నిందితులుగా పేర్కొంటూ అనుబంధ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది.

**తాజా పరిణామాలు**

సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా, ప్రాథమిక దర్యాప్తులో పోలీసుల నిర్లక్ష్యం, కుమ్మక్కు స్పష్టంగా కనిపిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసు విచారణను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పర్యవేక్షించాలని, 2026 నవంబర్ 30 నాటికి పూర్తి చేయాలని ఆదేశించింది. సాక్షులను బెదిరిస్తే బెయిల్ రద్దు చేస్తామని హెచ్చరించింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.ఈ నేపథ్యంలో, కేసులో కీలక ఆధారాలను విస్మరించి నిందితుడైన అనంతబాబుకు సహకరించిన నలుగురు పోలీస్ అధికారులపై డీజీపీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. సస్పెండ్ అయిన వారిలో కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన అప్పటి కాకినాడ డీఎస్పీ, ప్రస్తుతం భీమవరం అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న వి. భీమారావు, వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, అప్పట్లో సర్పవరం సీఐగా పనిచేసి ప్రస్తుతం కోనసీమ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఆకుల మురళీకృష్ణ, అప్పట్లో సర్పవరం స్టేషన్ ఎస్ఐగా ఉన్న ఎన్.సతీష్ బాబు ఉన్నారు. వీరిపై వెంటనే క్రమశిక్షణ చర్యలు ప్రారంభించాలని, 15 రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని ప్రభుత్వం ఆదేశించింది.

# మళ్లీ ఆసుపత్రిలో చేరిన శరద్ పవార్

**అస్వస్థతకు గురి కావడంతో రూబీ హాల్ క్లినిక్ ఆసుపత్రిలో చేరిక**

**తన తండ్రి దగ్గు, గొంతు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారన్న కుమార్తె సుప్రియా సూలే**

**వారం రోజుల క్రితమే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన శరద్ పవార్**



నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ ఆదివారం మళ్లీ ఆసుపత్రిలో చేరారు. అస్వస్థతకు గురికావడంతో పూణేలోని రూబీ హాల్ క్లినిక్ ఆసుపత్రిలో చేరారు. తన తండ్రి దగ్గు, గొంతు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారని ఆయన కుమార్తె, బారామతి ఎంపీ సుప్రియా సూలే తెలిపారు. అనారోగ్యం కారణంగా చికిత్స పొంది ఆయన వారం రోజుల క్రితమే ఇంటికి తిరిగి వచ్చారు.శరద్ పవార్ డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. శరద్ పవార్ ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలియాల్సి ఉంది. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

# శ్రీశైలంలో భక్తులకు తప్పిన పెను ప్రమాదం

**శ్రీశైలంలోని వీఐపీ కాటేజీలో అగ్నిప్రమాదం**

**ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలు**

**గది నుంచి భయంతో బయటకు పరుగులు తీసిన భక్తులు**

శ్రీశైలం పుణ్యక్షేత్రంలో భక్తులకు పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. యాత్రికులు బస చేసిన ఓ వీఐపీ కాటేజీలో అగ్నిప్రమాదం సంభవించింది. అప్రమత్తమైన భక్తులు వెంటనే బయటకు పరుగులు తీయడంతో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు. ఈ ఘటనతో అక్కడున్న వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.వివరాల్లోకి వెళ్తే.. శ్రీశైలంలోని ఓ వీఐపీ కాటేజీ గదిలో ఉన్న ఎయిర్ కండిషనర్ (ఏసీ)లో షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో ఏసీ నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగతో పాటు మంటలు చెలరేగాయి. ఆ సమయంలో గదిలో ఉన్న భక్తులు మంటలను గమనించి, భయంతో కేకలు వేస్తూ గది నుంచి బయటకు పరుగులు తీశారు. వారి అరుపులతో కాటేజీలోని ఇతర గదుల్లో ఉన్న వారు కూడా అప్రమత్తమై భవనం నుంచి బయటకు వచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు, భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై శ్రీశైలం దేవస్థానం అధికారులు విచారణకు ఆదేశించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు.

## హెచ్ఎంపీవీ కలకలం ఈ ఆహార పదార్థాలతో చెక్ పెట్టండిలా



హెచ్ఎంపీవీ వైరస్ కలకలం సృష్టిస్తోన్న సంగతి తెలిసిందే. ఇండియాలోనూ కేసులు నమోదు అవుతున్నాయి. బెంగళూరు, అహ్మదాబాద్‌లో హెచ్ఎంపీవీ కేసులు నమోదు కావడంతో.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అలర్ట్ అవుతున్నాయి. అంతేకాకుండా హెచ్ఎంపీవీ వైరస్ నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..? రోగ నిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలనే దానిపై డాక్టర్లు పలు సలహాలు సూచనలు ఇస్తున్నారు. ఈ వైరస్‌ను ఎదుర్కోవాలంటే మన మెనూలో స్వల్ప మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. డైట్ ప్లాన్ తప్పనిసరిగా ఉండాలని చెబుతున్నారు. రోగ నిరోధక శక్తిని పెంపొందించే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో వైరల్ ఇన్‌ఫెక్షన్‌కు గురైన త్వరగా కోలుకోనే సామర్థ్యం ఉంటుందని చెబుతున్నారు.

**ఏయే ఆహార పదార్థాలు తీసుకోవాలంటే..?**

యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలి. అంటే ఉసిరి, ఆరెంజ్, నిమ్మ, రెడ్ పెపర్ తీసుకోవాలి. ఉసిరిలో విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది. ఆరెంజ్, నిమ్మలో కూడా విటమిన్ సీతో పాటు ఫ్లావినాయిడ్స్, లిమోనాయిడ్స్ ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. రెడ్ పెప్పర్‌లో విటమిన్ సీ, విటమిన్ బీ6, యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా లభిస్తాయి. పసుపు, అల్లం, దాల్చిన చెక్క కూడా వైరల్ ఇన్‌ఫెక్షన్లకు మంచి మెడిసిన్‌గా పని చేస్తాయి. విటమిన్ డీ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహార పదార్థాలను కూడా తీసుకోవాలి. చేపలు, మష్రూమ్స్(పుట్టగొడుగులు), పాల ఉత్పత్తులు కూడా మంచివి. రెండు రోజులకు ఒకసారి దానిమ్మ తింటే మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళ గ్రీన్ టీ సేవించొచ్చు.

## చలికాలమంటే భయం!



మా అబ్బాయి వయసు అయిదేండ్లు. చలికాలం మొదలైందంటే చాలు జలుబు, దగ్గుతో బాధపడుతుంటాడు. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తే నెబ్యులైజర్ వాడమన్నారు. వాడితే తగ్గిపోతుంది. ఇలా ఎండకాలం వచ్చేదాకా నెబ్యులైజర్ వాడాల్సి వస్తుంది. మిగతా కాలంలో బాగానే ఉంటాడు. ఈ సమస్యకు పరిష్కారం సూచించగలరు మీ బిడ్డకు శ్వాసనాళాలు కుంచించుకుపోయే 'హైపర్ యాక్టివ్ ఎయిర్‌వే డిసీజ్' ఉండి ఉండొచ్చు. చల్లని వాతావరణం, దుమ్ము, కాలుష్యం, శ్వాస సంబంధమైన ఇన్ఫెక్షన్ల బారినపడినప్పుడు కొందరిలో శ్వాసనాళాలు కుంచించుకుపోతాయి. ఇలా జరిగినప్పుడు పిల్లల్లో పిల్లికూతల వంటి చప్పుడు వస్తుంది. ఇది పెద్దవాళ్లలో ఉండే ఆస్తమా లాగా ఉంటుంది. ఈ సమస్యకు నెబ్యులైజర్ ఉపశమనం కలిగిస్తుంది. బిడ్డకు పదేపదే ఇలా జరుగుతుంటే దీని నివారణ కోసం చికిత్స కూడా తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఇన్‌హేలర్ వాడాలి. మన సమాజంలో ఇన్‌హేలర్ వాడకం పట్ల అపోహలు, భయాలు ఉన్నాయి. ఇన్‌హేలర్ తక్కువ డోసులో సమస్య తీవ్రతను తగ్గిస్తుంది. మీ బాబుని శ్వాసకోశ నిపుణులకు చూపించండి. ప్రివెంటివ్ థెరపీ, ఇన్‌హేలర్ థెరపీ అవసరాన్ని బట్టి తీసుకోండి. ఏ కారణం వల్ల ఈ సమస్య వస్తుందో గుర్తించడం అన్నిటికన్నా ముఖ్యమైన విషయం. సమస్యకు కారణం తెలిస్తే పిల్లల్ని దానికి దూరంగా ఉంచితే అది పరిష్కారమైనట్టే. డైరీ పెట్టుకుని ఎప్పుడు ఇబ్బంది పడుతున్నాడు ఎంత తీవ్రంగా ఉంది? మందు ఇస్తే, దాని ప్రభావాన్ని రాస్తూ పోవాలి. అలాగే ఎదుగుదల ఎలా ఉందో కూడా రాయాలి. పెరుగుతున్న వాతావరణ కాలుష్యం కూడా దీనికి కారణం కావొచ్చు. మీ బిడ్డ సమస్య ఆస్తమా అయి ఉండొచ్చు. మీ ఇంట్లో ఎవరికైనా ఎలర్జీ, ఆస్తమా వంటి లక్షణాలు ఉన్నదీ, లేనిదీ చెప్పలేదు. ఆస్తమా అంటే చాలామంది భయపడతారు. పద్ధతి ప్రకారం వైద్యం చేస్తే ఆస్తమాను తగ్గించవచ్చు. ఇప్పుడు మీరు రెండు ముఖ్యమైన పనులు చేయాలి. బిడ్డకు పోషకాహారం ఇవ్వడం ద్వారా ఈ అనారోగ్య సమస్యను తట్టుకునేలా సిద్ధం చేయడం మొదటిది. పిల్లల శ్వాసకోశ వైద్యులు సూచించిన మందులు, ఇన్‌హేలర్ వాడటం రెండోది. వీటివల్ల కొంత ఉపశమనం లభించవచ్చు.

## చలికాలంలో వెచ్చగా ఉండాలా అయితే రోజూ లవంగాలను తినండి



చలికాలం మరింత ముందుకు సాగింది. అనేక చోట్ల సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో చలి నుంచి తమను తాము రక్షించుకునేందుకు చాలా మంది అనేక మార్గాలను అనుసరిస్తున్నారు. చలికాలంలో చలి నుంచి రక్షణగా ఉండేందుకు చాలా మంది ఉన్ని దుస్తులను ధరిస్తుంటారు. అలాగే తీసుకునే ఆహారంలోనూ అనేక మార్పులు చేస్తుంటారు. అయితే చలికాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచడంలో పలు ఆహారాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. వాటిల్లో లవంగాలు కూడా ఒకటి. లవంగాలనుఈ సీజన్‌లో తీసుకోవడం వల్ల శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవచ్చు. అలాగే లవంగాలను తినడం వల్ల మనకు పలు ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. కనుక ఈ సీజన్‌లో లవంగాలను తినాలని వైద్యులు సూచిస్తున్నారు.

**కాళ్లు, చేతులు కూడా..**

చలికాలంలో మనం శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే వస్త్రాలను ధరిస్తుంటాం. అయినప్పటికీ మన కాళ్లు, చేతులు చల్లగా మారుతుంటాయి. న్యూట్రిషనిస్టులు చెబుతున్న ప్రకారం మన శరీరంలో రక్త సరఫరా లేనందువల్లే కాళ్లు, చేతులు చల్లగా ఉంటాయట. అందుకనే మిగిలిన శరీరం మొత్తం వెచ్చగా ఉన్నప్పటికీ కాళ్లు, చేతులు చల్లగా ఉంటాయి. అయితే లవంగాలను తినడం వల్ల కాళ్లు, చేతులను కూడా పూర్తిగా వెచ్చగా ఉంచుకోవచ్చు. ఇవి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. చలికాలంలో కచ్చితంగా లవంగాలను ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. లవంగాలను తినడం వల్ల శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో కాళ్లు, చేతులకు రక్తం సరిగ్గా సరఫరా అవుతుంది. ఫలితంగా ఆయా భాగాలు కూడా వేడిగా ఉంటాయి. లవంగాల్లో యూజినాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది రక్తనాళాలను వెడల్పుగా చేస్తుంది. దీంతో రక్త సరఫరా పెరుగుతుంది. ఫలితంగా చల్లగా ఉండే చేతులు, కాళ్లు కూడా వెచ్చగా మారుతాయి. ఇక లవంగాలను తినడం వల్ల పలు ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

**యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ..**

లవంగాల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చాలా శక్తివంతమైనవి. ఫ్రీ ర్యాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఈ సీజన్‌లో వచ్చే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. లవంగాల్లో యాంటీ సెప్టిక్, యాంటీ వైరల్, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇవి గొంతు నొప్పి, దగ్గు నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. లవంగాలలో ఉండే యూజినాల్ అనే సమ్మేళనం జెర్మిసైడల్ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. నోట్లో ఉండే పుండ్లు కూడా తగ్గుతాయి. లవంగాల్లో ఉండే యూజినాల్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. విరేచనం సాఫీగా అయ్యేలా చేస్తుంది. దీంతో మలబద్ధకం తగ్గుతుంది.

**అధిక బరువు తగ్గుతారు..**

లవంగాలను తినడం వల్ల అధిక బరువును తగ్గించుకోవచ్చు. లవంగాలను తింటే శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. దీంతో కొవ్వు కరుగుతుంది. ఫలితంగా అధిక బరువు తగ్గుతారు. బరువు నియంత్రణలో ఉంటుంది. లవంగాలు మన చర్మానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో చర్మం మృదువుగా మారి మెరుస్తుంది. అదేవిధంగా జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. గ్యాస్, మలబద్ధకం, అసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా లవంగాలతో మనం ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు.

## కొలెస్ట్రాల్ నుండి డయాబెటిస్ వరకు ఖాళీ కడుపుతో ఈ ఆకులు నమిలితే సూపర్ బెనిఫిట్స్

### అయితే, ఏ ఆకులు తీసుకోవాలి? వీటి ఆరోగ్య ప్రయోజనాలు ఏంటి అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం



మన వంటగదిలో రుచిని పెంచడమే కాకుండా ఆరోగ్య నిధిగా కూడా ఉండే కొన్ని వస్తువులు ఉన్నాయి. వీటిలో ఒకటి కరివేపాకు.. ఈ చిన్న ఆకు కేవలం వంటకు మాత్రమే కాకుండా ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుందని మీకు తెలుసా కొలెస్ట్రాల్ నుండి డయాబెటిస్ వరకు ఖాళీ కడుపుతో ఈ ఆకులు నమిలితే సూపర్ బెనిఫిట్స్ ఉంటాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అయితే, వీటి ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..ఆయుర్వేదంలో, కరివేపాకును అనేక వ్యాధులను నయం చేసే సహజ ఔషధంగా పరిగణిస్తారు. అందువల్ల, ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో దీనిని నమిలితే, కొలెస్ట్రాల్, డయాబెటిస్‌ను నియంత్రించడంలో ఇది చాలా ఉపయోగపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది**

కరివేపాకు శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి , మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో దీనిని తినడం వల్ల గుండె సిరలు శుభ్రంగా ఉంటాయి. గుండెపోటు ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి.

**చక్కెర స్థాయి సమతుల్యంగా ఉంటుంది**

కరివేపాకు మధుమేహ రోగులకు చాలా మంచిది . ఇందులో ఉండే యాంటీ-డయాబెటిక్ లక్షణాలు రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి . దీన్ని క్రమం తప్పకుండా తినడం వల్ల ఇన్సులిన్ కార్యకలాపాలు మెరుగుపడతాయి. చక్కెర స్థాయి అకస్మాత్తుగా పెరగడం లేదా తగ్గడం అనే సమస్య ఉండదు .

**జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది**

మీకు గ్యాస్, మలబద్ధకం లేదా అసిడిటీ సమస్యలు ఉంటే, కరివేపాకు నమలడం చాలా మంచిది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. శరీరం నుండి విషాన్ని తొలగించడంలో సహాయపడుతుంది.

**బరువు తగ్గడంలో సహాయపడుతుంది**

కరివేపాకులో ఉండే ఫైబర్, యాంటీ-ఆక్సిడెంట్లు శరీర కొవ్వును తగ్గించడంలో సహాయపడతాయి. మీరు బరువు తగ్గాలని ప్రయత్నిస్తుంటే, ఉదయం ఖాళీ కడుపుతో దీనిని తీసుకోవడం మీకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

**కళ్ళు, చర్మానికి ప్రయోజనకరం**

కరివేపాకు విటమిన్లలను అందిస్తాయి. ఇవి మీ కళ్ళను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇది జుట్టు మూలాలను బలోపేతం చేస్తుంది. ఉదయం నిద్ర లేచిన తర్వాత, ఖాళీ కడుపుతో 5 కరివేపాకులను నమిలి, ఆపై ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగితే ఆరోగ్యానికి చాలా మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## వాయు కాలుష్యం ఎఫెక్ట్ 1000 రోజులు తగ్గుతున్న జీవితకాలం

ఢిల్లీలో ఇటీవల రెస్పికాన్ 2025 అనే సదస్సు నిర్వహించారు. అయితే, ఈ సదస్సులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. భారతదేశంలోని యువత ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు తెలుస్తోంది. భారతదేశంలో వాయు కాలుష్యం తీవ్రమైన ముప్పుగా మారింది. ఢిల్లీలో ఇటీవల రెస్పికాన్ 2025 అనే సదస్సు నిర్వహించారు. అయితే, ఈ సదస్సులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. భారతదేశంలోని యువత ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు తెలుస్తోంది. వాయు కాలుష్యం వల్ల అనేక రకాల శ్వాసకోశ సమస్యలు, క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా యువతలో ఈ సమస్యలు వేగంగా పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. చెడు గాలి, బయోమాస్ ఇంధనం వాడకం, స్మోకింగ్ వంటి కారణాల వల్ల యువతలో ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి.ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ టిబి రిపోర్ట్ 2024 ప్రకారం, 2022లో భారతదేశంలో ప్రతి లక్ష జనాభాకు 199 కొత్త టిబి కేసులు నమోదయ్యాయి. దీనితో పాటు, పెరుగుతున్న న్యుమోనియా కేసులపై కూడా దృష్టి సారించారు. ప్రపంచవ్యాప్తంగా, ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల మరణాల రేటు న్యుమోనియా కారణంగా ఉందని, దీని రేటు 14% ఉందని వెల్లడించారు. ఈ పెరుగుతున్న కేసుల వెనుక వాయు కాలుష్యం, కలుషితమైన





వాతావరణం ఎఫెక్ట్ ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దీని వల్ల యువత ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయి. విషపూరితమైన గాలి భారతీయుల సగటు జీవితకాలాన్ని సుమారు 1,000 రోజులు తగ్గిస్తోందని సమావేశంలో సంచలన విషయాలు చర్చించారు. స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ 2020 నివేదిక ప్రకారం, భారతదేశంలో వాయు కాలుష్యం కారణంగా ప్రజల సగటు ఆయుర్దాయం 1.5 నుండి 2 సంవత్సరాలు (అంటే సుమారు 1000 రోజులు) తగ్గుతోంది. యువత ఆరోగ్య భవిష్యత్తుపై ఇది ఆందోళన కలిగించే విషయమని నిపుణులు అంటున్నారు.

యువత ఊపిరితిత్తుల ఆరోగ్యం వేగంగా క్షీణిస్తోందని నిపుణులు హెచ్చరించారు. ప్రతి సంవత్సరం దాదాపు 81,700 కొత్త ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. ఈ సంఖ్య పెరుగుతున్న ప్రమాదాన్ని సూచిస్తుంది. గతంలో ఊపిరితిత్తుల వ్యాధులు కేవలం వృద్ధులలో మాత్రమే కనిపించేవి, కానీ ఇప్పుడు ఊపిరితిత్తుల క్యాన్సర్, %జూూణ, ఎదీ% వంటి కేసులు యువతలో కూడా వేగంగా కనిపిస్తున్నాయి.

## వెల్లుల్లిని తేనెలో కలిపి తింటే ఏమవుతుందో తెలుసా?



ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ఖరీదైన మాత్రలు అవసరం లేదు. ఇంట్లో లభించే సహజ పదార్థాలను ఉపయోగించడం ద్వారా మీరు మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అలాంటి అద్భుతమైన ఔషధం వెల్లుల్లి, తేనె మిశ్రమం. ఈ మిశ్రమం ఎందుకు మంచిది? ఇది ఎలాంటి ఆరోగ్య సమస్యలకు ప్రయోజనకరంగా ఉంటుందో ఇప్పుడు తెలుసుకుందాం.ఇటీవలి కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఖరీదైన మాత్రలు వేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. కానీ, వ్యాధుల నుండి ఉపశమనం పొందడానికి మీరు ఆయుర్వేద సలహాలను సరిగ్గా పాటిస్తే అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అయితే.. వెల్లుల్లి, తేనె మిశ్రమం ఎలాంటి ఆరోగ్య సమస్యలకు ప్రయోజనకరంగా ఉంటుంది? ఈ మిశ్రమం ఎందుకు మంచిది? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది:**

వెల్లుల్లి, తేనె రెండింటిలోనూ యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రతిరోజూ ఉదయం వీటిని తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఫలితంగా జలుబు, గొంతు నొప్పి, తరచుగా వచ్చే జ్వరాలు వంటి సమస్యలు దూరమవుతాయి.

**జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది:**

వెల్లుల్లి జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. ఇది ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడంలో కూడా సహాయపడుతుంది. అంతే కాకుండా గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలను కూడా తగ్గిస్తుంది. తేనెలో ఉండే మంచి బ్యాక్టీరియా కడుపు సంబంధిత సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. అలాగే, సైనస్ సమస్యలను కూడా తగ్గిస్తుంది. దీనితో పాటు, తేనె గొంతు నొప్పి నుండి ఉపశమనం పొందడంలో కూడా సహాయపడుతుంది.

**గుండె ఆరోగ్యానికి మంచిది:**

వెల్లుల్లి గుండెకు చాలా మేలు చేస్తుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ఇది రక్తాన్ని పలుచబరిచి రక్తపోటును నిర్వహించడానికి సహాయపడుతుంది.


**శక్తిని అందిస్తుంది:**

తేనె తక్షణ శక్తిని ఇస్తుంది. వెల్లుల్లి రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేయడంలో సహాయపడుతుంది. ఈ రెండింటిలోనూ ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. అవి వృద్ధాప్య ప్రక్రియను కూడా నెమ్మదిస్తాయి. గోరువెచ్చని నీటితో కలిపి తీసుకుంటే, ఇది జీవక్రియను పెంచుతుంది. బరువు తగ్గడంలో సహాయపడుతుంది.

**ఎలా తినాలి?**

తాజా వెల్లుల్లి రెబ్బలను తొక్క తీసి శుభ్రం చేసి, శుభ్రమైన గాజు కూజాలో ఉంచండి. వెల్లుల్లి రెబ్బలు పూర్తిగా మునిగిపోయేలా వాటిపై తగినంత తేనె పోయాలి. కూజాను మూసివేసి 7 నుండి 10 రోజులు అలాగే ఉంచండి. ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బలను నమలండి. అయితే, దీనిని పిల్లలు లేదా మధుమేహం ఉన్నవారు తీసుకోకూడదు.

## షుగర్ ఉన్నవారు రాత్రిపూట ఎన్ని చపాతీలను తింటే మంచిది



ప్రస్తుత తరుణంలో చాలా మంది డయాబెటిస్ బారిన పడుతున్నారు. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ అనేక మందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. ఒకప్పుడు కేవలం వయస్సు మీద పడిన వారికే షుగర్ వ్యాధి వచ్చేది. కానీ ఇప్పుడు యుక్త వయస్సులో ఉన్నవారు కూడా టైప్ 2 డయాబెటిస్ బారిన పడుతున్నారు. అయితే డయాబెటిస్ రాగానే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. షుగర్ కంట్రోల్ లో ఉంటే దీర్ఘకాలం పాటు జీవించవచ్చని అంటున్నారు. అయితే డయాబెటిస్ కంట్రోల్ అవ్వాలంటే డాక్టర్లు ఇచ్చే మందులను తప్పనిసరిగా క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది. దీంతోపాటు రోజుకు తగినంత నిద్ర పోవాలి. నీళ్లను తాగాలి. అదేవిధంగా డైట్‌ను కూడా పాటించాల్సి ఉంటుంది. డయాబెటిస్ వచ్చిన వారు ఏ ఆహారాన్ని పడితే దాన్ని తినకూడదు.

**బరువు తగ్గాలి..**

షుగర్ వ్యాధి ఉన్నవారు తీసుకునే ఆహారం విషయంలో అనేక మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా బరువును తగ్గించుకోవాలి. దీంతో ఆటోమేటిగ్గా షుగర్ కూడా కంట్రోల్ అవుతుంది. అయితే బరువు తగ్గడంతోపాటు ఆ బరువు నియంత్రణలో ఉండేలా చూడాలి. దీంతో షుగర్ లెవల్స్ ఎప్పటికీ పెరగకుండా ఉంటాయి. దీనికి గాను ఎప్పటికీ డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా బరువును పెంచే ఆహారాలను తినకూడదు. ఇవి షుగర్ లెవల్స్‌ను కూడా పెంచుతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. షుగర్ ఉన్నవారు ఆహారం విషయంలో మాత్రం అనేక జాగ్రత్తలను పాటించాల్సిందే. లేదంటే షుగర్ కంట్రోల్ అవదు.

**పుల్కా మాదిరిగా చేసి తినాలి..**

ఇక డయాబెటిస్ ఉన్నవారు చపాతీలను తినాలని సూచిస్తుంటారు. ఎందుకంటే రైస్‌తో పోలిస్తే చపాతీల గ్లైసీమిక్ ఇండెక్స్ కాస్త తక్కువగా ఉంటుంది. పైగా గోధుమ పిండిలో ఫైబర్ ఉంటుంది కనుక చపాతీలను తింటే అంత త్వరగా షుగర్ లెవల్స్ పెరగవు. అందువల్లనే చాలా మంది రాత్రి పూట భోజనంలో అన్నంకు బదులుగా చపాతీలను తింటుంటారు. బరువు తగ్గాలనుకునే వారు కూడా తమ డైట్‌లో చపాతీలను చేర్చుకుంటారు. రాత్రి పూట రెండు చపాతీలను నూనె లేకుండా పుల్కా మాదిరిగా కాల్చుకుని తింటే ఎంతో మేలు జరుగుతుంది. అయితే రాత్రి పూట ఎన్ని చపాతీలను తినాలని చాలా మంది సందేహిస్తుంటారు. ఇందుకు నిపుణులు ఏమని సమాధానం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఎన్ని చపాతీలు తినాలంటే..?**

చపాతీల్లో అనేక విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. వీటిల్లో ఫైబర్ ఉంటుంది కనుక వీటిని తింటే జీర్ణక్రియ కూడా మెరుగు పడుతుంది. అయితే రాత్రి పూట 30 నుంచి 50 గ్రాముల మేర పిండి పదార్థాలు లభిస్తే చాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. అంటే మీడియం సైజ్ ఉన్న చపాతీలు అయితే 2 లేదా 3 చాలు. పెద్దవి అయితే 2 చాలు అని వైద్యులు చెబుతున్నారు. ఇలా చపాతీలను తింటే ఆరోగ్యంగా ఉండవచ్చని, దీంతోపాటు షుగర్ లెవల్స్ కూడా తగ్గుతాయని అంటున్నారు. అయితే కొందరు అన్నం మానేస్తున్నామని చెప్పి చపాతీలను అధికంగా తింటారు. ఇలా చేసినా కూడా అనర్థమేనట. దీని వల్ల షుగర్ లెవల్స్ పెరుగుతాయని అంటున్నారు. కనుక రాత్రి పూట పరిమిత మోతాదులో చపాతీలను తింటేనే వీటి ద్వారా ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

# మీరు బిజినెస్‌లో కింగ్ అవ్వాలంటే..



వ్యాపారం అంటే కేవలం పెట్టుబడి, అమ్మకాలు మాత్రమే అనుకుంటే పొరపాటే! ప్రస్తుత కాలంలో మారుతున్న అంతర్జాతీయ ఆర్థిక సమీకరణాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో బిజినెస్ రూపురేఖలే మారిపోయాయి. చాలా మంది పాత పద్ధతులతో నష్టపోతుంటే, కొందరు మాత్రం టెక్నాలజీని వాడుకుంటూ కోట్ల రూపాయల లాభాలు గడిస్తున్నారు. ఇంతకీ ఆ సక్సెస్ మంత్ర ఏమిటో తెలుసుకోవాలని అందరికీ కుతూహలంగా ఉంటుంది. వ్యాపారం చేసే ప్రతి వ్యక్తి కచ్చితంగా తెలుసుకోవాల్సిన ఐదు వ్యూహాలను కింద తెలియజేశాం. **ఆర్థిక నిర్వహణ** వ్యాపారానికి క్యాష్ ఫ్లో, ఆర్థిక నిర్వహణ చాలా కీలకం. 2025లో గ్లోబల్ ఇన్‌ఫ్లేషన్ 3% వద్ద స్థిరపడినప్పటికీ అంతర్జాతీయ టారిఫ్‌లు, సప్లై చైన్ సమస్యల వల్ల ముడిసరుకుల ధరలలో అనిశ్చితి కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం సేల్స్ పెంచుకోవడం మీద కాకుండా, ప్రాఫిట్ మార్జిన్లపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా 'ప్రాఫిట్ ఫస్ట్' పద్ధతిని అనుసరించడం ద్వారా ఆదాయం రాగానే లాభం, పన్నులు, వేతనాలను పక్కన పెట్టి, మిగిలిన మొత్తంతోనే ఖర్చులను నిర్వహించాలి. మార్కెట్‌లోని కొన్ని సాఫ్ట్‌వేర్‌లు ఇప్పుడు ఏఐ ఆధారిత అనలిటిక్స్‌ను అందిస్తున్నాయి. ఇవి భవిష్యత్తులో రాబోయే ఖర్చులను ముందే అంచనా వేసి, ఖర్చులను 20–30% తగ్గించడంలో సహాయపడుతున్నాయి. **కస్టమర్ ఫోకస్** కస్టమర్ అక్విజిషన్ కాస్ట్ (కొత్త కస్టమర్‌ను ఆకర్షించే ఖర్చు) భారీగా పెరిగింది. అందుకే ఉన్న కస్టమర్లను నిలబెట్టుకోవడమే అత్యంత లాభదాయకమైన మార్గం. 80 శాతానికిపైగా చిన్న వ్యాపారాలు ఇప్పుడు జనరేటివ్ ఏఐను వాడుతూ కస్టమర్లకు ప్రత్యేక అనుభవాన్ని అందిస్తున్నాయి. వ్యాపారులు కస్టమర్ డేటాను విశ్లేషించి, వారి అవసరాలకు తగినట్లుగా లాయల్టీ ప్రోగ్రామ్‌లు రూపొందించడం వల్ల రిపీట్ సేల్స్ పెరుగుతాయి. తాజా సర్వేల ప్రకారం, కస్టమర్ రిటెన్షన్ రేటు(అధిక మార్జిన్లు వచ్చే వస్తువులను కొనేలా చేయడం) 5% పెరిగితే, ప్రాఫిట్ మార్జిన్లు 25% నుంచి 29% వరకు మెరుగుపడే అవకాశం ఉంది. **ఖర్చుల నియంత్రణ** ఖర్చు తగ్గించడం అంటే నాణ్యతను తగ్గించడం కాదు, వనరులను సమర్థవంతంగా వాడటం అని గుర్తుంచుకోవాలి. ఇంధన ధరలు, కార్మిక వ్యయాలు పెరిగిన తరుణంలో ఆటోమేషన్ ఒక వరంగా మారింది. క్లౌడ్ ఆధారిత టూల్స్, ఎనర్జీ–ఎఫిషియంట్ పరికరాలను వాడటం ద్వారా ఖర్చులను తగ్గించవచ్చు. టెక్నాలజీ సాయంతో తక్కువ సిబ్బందితో ఎక్కువ అవుట్‌పుట్ సాధించేలా ఆపరేషన్లను ఆప్టిమైజ్ చేయాలి. దీనివల్ల ఇన్‌ఫ్లేషన్, టారిఫ్‌ల ప్రభావం వ్యాపారంపై తక్కువగా ఉంటుంది. **డిజిటల్ పరివర్తన** 'ఏఐ వ్యాపారాలను భర్తీ చేయదు కానీ, ఏఐని వాడే వ్యాపారస్తులు దాన్ని వాడని వారిని వెనక్కి నెట్టేస్తారు' అనేది నిజం. ప్రపంచవ్యాప్తంగా ఏఐ మౌలిక సదుపాయలపై 400 బిలియన్ డాలర్ల పెట్టుబడులు జరుగుతున్న తరుణంలో దీన్ని విస్మరించడం అసాధ్యం. ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్(వస్తు నిర్వహణ)లో ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వాడటం ద్వారా స్టాక్ వృథాను అరికట్టవచ్చు. ఆటోమేటెడ్ ఇన్వాయిసింగ్(ఆటోమేటెడ్ బిల్లింగ్ విధానం) ద్వారా పేమెంట్స్ త్వరగా వచ్చేలా చూడవచ్చు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సైతం ఏఐ బాట్‌లను వాడి 24/7 కస్టమర్ సపోర్ట్ అందించడం ద్వారా గ్లోబల్ మార్కెట్‌లో పోటీ పడుతున్నాయి. **మార్కెట్ ట్రెండ్స్** మార్కెట్ మారుతున్న వేగానికి అనుగుణంగా వ్యాపార సరళి మారకపోతే ఎంతటి పెద్ద బిజినెస్ అయినా కుప్పకూలుతుంది. పర్యావరణ హితమైన పద్ధతులు పాటిస్తున్న బిజినెస్‌ల పట్ల కస్టమర్లు మక్కువ చూపుతున్నారు. ఇది బ్రాండ్ విలువను పెంచడమే కాకుండా దీర్ఘకాలంలో పన్ను రాయితీలకు కూడా దోహదపడుతుంది. డేటా అనలిటిక్స్ ద్వారా మార్కెట్ మూడ్‌ను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అవసరమైతే బిజినెస్ మోడల్‌ను మార్చుకోవడానికి సిద్ధంగా ఉండాలి.

# మార్కెట్‌లో లిస్ట్ కాకముందే కోటీశ్వరులు కావొచ్చా

అన్‌లిస్టెడ్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం అనేది ప్రస్తుతం ఇన్వెస్టర్లలో బాగా ప్రాచుర్యం పొందుతున్న అంశం. స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ కాకముందే తక్కువ ధరకు ఈ కంపెనీల షేర్లు కొని, ఐపీఓ ద్వారా మార్కెట్‌లో లిస్ట్ అయిన తర్వాత అధిక లాభాలు సంపాదించవచ్చని చాలా మంది భావిస్తున్నారు. అయితే, మెరిసేదంతా బంగారం కాదని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల సెబీ సైతం అన్‌రెగ్యులేటెడ్ ప్లాట్‌ఫామ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తుండటంతో అన్‌లిస్టెడ్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేముందు కొన్ని కీలక విషయాలను తెలుసుకోవడం అత్యవసరం.'గ్రే మార్కెట్' ఉచ్చులో పడకండి! అన్‌లిస్టెడ్ షేర్లు సాధారణంగా అధికారిక స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లభించవు. వీటిని 'గ్రే మార్కెట్' లేదా కొన్ని ప్రైవేట్ యాప్స్ ద్వారా విక్రయిస్తుంటారు. అయితే, వీటిలో ధరను పారదర్శకంగా నిర్ణయించరనే వాదనలున్నాయి. ఒక యాప్‌లో ఒక ధర ఉంటే, మరో చోట మరో ధర ఉండే అవకాశం ఉంది. సెబీ ఇప్పటికే ఇలాంటి అనధికారిక ప్లాట్‌ఫామ్‌ల పట్ల ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. అయితే అన్‌లిస్టెడ్ కంపెనీల్లో ఎంత లాభం ఉందో అంతే రిస్క్ కూడా ఉందని గమనించాలి. అన్‌లిస్టెడ్ కంపెనీలు అంటే ఏమిటి స్టాక్ ఎక్స్ఛేంజీలు (బీూజు, దీూజు)లో నమోదు కాని కంపెనీలను అన్‌లిస్టెడ్ కంపెనీలు అంటారు. ఇవి సాధారణంగా స్టార్టప్‌లు కావచ్చు లేదా పబ్లిక్ ఇష్యూకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న పెద్ద కంపెనీలు కావచ్చు. వీటి షేర్లను 'ప్రీ–ఐపీఓ షేర్లు' అని కూడా అంటారు.ఎలా పెట్టుబడి పెడుతారంటే..అన్‌లిస్టెడ్ మార్కెట్‌లో షేర్లు కొనడానికి నేరుగా స్టాక్ ఎక్స్ఛేంజీలు ఉండవు. దీనికోసం కొన్ని మార్గాలను అనుసరిస్తారు. ప్రస్తుతం అన్‌లిస్టెడ్ షేర్ల ట్రేడింగ్ కోసం ్రతీవషఅంవ, ఖఅశ్రీఅర్‌వస్గశీఅవ, ఞాశ్రీఅబం ×అజవర్‌వష్ట్ర.. వంటి చాలా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులో ఉన్నాయి. కొంతమంది స్టాక్ బ్రోకర్లు పర్సనలైజ్డ్ సర్వీసుల ద్వారా అన్‌లిస్టెడ్ షేర్లను విక్రయిస్తుంటారు. ఇంకో మార్గం ఏమిటంటే.. కంపెనీ ఉద్యోగులు తమకు వచ్చిన షేర్లను బయటి వ్యక్తులకు విక్రయించినప్పుడు వాటిని కొనుగోలు చేయవచ్చు. **ఇన్వెస్ట్ చేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు** లిస్టెడ్ షేర్లను మనం ఎప్పుడు కావాలంటే అప్పుడు ఓపెన్ మార్కెట్‌లో అమ్ముకోవచ్చు. కానీ అన్‌లిస్టెడ్ షేర్లకు కొనుగోలుదారులు దొరకడం కష్టం. మీరు అత్యవసరంగా అమ్మాలనుకున్నప్పుడు అవి అమ్ముడుపోకపోవచ్చు.లిస్టెడ్ కంపెనీల వలె ఇవి ప్రతి త్రైమాసిక ఫలితాలను వెల్లడించాల్సిన అవసరం లేదు. కాబట్టి కంపెనీ ఫైనాన్షియల్ వివరాలు తెలుసుకోవడం కష్టమవుతుంది.సెబీ నిబంధనల ప్రకారం, ఒక కంపెనీ ఐపీఓకి వచ్చిన తర్వాత, అంతకుముందు కొన్న అన్‌లిస్టెడ్ షేర్లపై 6 నెలల వరకు లాక్–ఇన్ పీరియడ్ ఉంటుంది. అంటే లిస్ట్ అయిన వెంటనే మీరు వాటిని అమ్మలేరు.ఈ షేర్ల ధర డిమాండ్, సప్లై ఆధారంగా మారుతుంటుంది. అధికారిక ధర అంటూ ఏదీ ఉండదు కాబట్టి ఇతర ప్లాట్‌ఫామ్‌లతో ధరను సరిపోల్చుకోవాలి. **లిస్టింగ్ అయ్యే విధానం** అన్‌లిస్టెడ్ కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ అవ్వాలంటే సుదీర్ఘ ప్రక్రియను అనుసరించాలి. కంపెనీ ముందుగా ఐపీఓ ప్రక్రియను పర్యవేక్షించడానికి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లను నియమించుకుంటుంది. కంపెనీ తన పూర్తి వివరాలతో కూడిన డీఆర్‌హెచ్‌పీను సెబీకి సమర్పిస్తుంది. సెబీ ఈ నివేదికను పరిశీలించి



అన్నీ బాగున్నాయని భావిస్తే అనుమతి ఇస్తుంది. కంపెనీ తన షేర్ ధరను నిర్ణయించి పబ్లిక్ ఇష్యూ తేదీలను ప్రకటిస్తుంది. ఐపీఓ సక్సెస్ అయ్యాక షేర్లు ఎక్స్ఛేంజీల్లో ట్రేడింగ్‌కు అందుబాటులోకి వస్తాయి. దాంతో అన్‌లిస్టెడ్‌గా ఉన్న షేర్లు లిస్టెడ్ కేటగిరీలోకి మారతాయి.

# ఈ ఏడాది టెక్ కంపెనీల్లో లేఆఫ్స్ కలకలం




ఏఐ రాకతో మారుతున్న ముఖచిత్రం

భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ రంగంలో లేఆఫ్స్ పర్వం కొనసాగుతోంది. ఒకవైపు కృత్రిమ మేధ(ఏఐ) కొత్త పుంతలు తొక్కుతుంటే, మరోవైపు అదే వేగంతో ఉద్యోగాల కోత పెరుగుతోంది. ప్రముఖ లేఆఫ్స్ ట్రాకర్ 'లేఆఫ్స్.ఎఫ్‌వైఐ'(ఋఎశీటటం.టఎఱ) తాజా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 551 టెక్ కంపెనీల నుంచి 1,22,549 మందికి పైగా ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోయారు. గత కొన్ని వారాలుగా ఈ వేగం కొద్దిగా తగ్గినట్లు కనిపిస్తున్నా, ప్రభావం మాత్రం తీవ్రంగా ఉంది.ప్రముఖ కంపెనీలు ఇలా..అమెజాన్.. అక్టోబర్‌లో కంపెనీ చరిత్రలోనే ఎప్పుడూ లేనంతగా అత్యధికంగా ఉద్యోగాల కోత విధిస్తూ 14,000 కొలువులను తొలగించింది.మైక్రోసాఫ్ట్.. 2025 నాటికి మొత్తం 15,000 మందిని తొలగించే దిశగా అడుగులు వేసింది. జులైలోనే దాదాపు 9,000 మందిని పంపించివేసింది.ఇంటెల్.. చిప్ తయారీలో వెనుకబడటం, ఆర్థిక నష్టాల నేపథ్యంలో ఏకంగా మొత్తం సిబ్బందిలో 15% (సుమారు 25,000 మంది) తగ్గించుకోవాలని నిర్ణయించుకుంది.సేల్స్ ఫోర్స్.. ఏఐ సహాయంతో 4,000 మంది కస్టమర్ సపోర్ట్ ఉద్యోగులను తగ్గించినట్లు సీఈఓ మార్క్ బెనియోఫ్ ధ్రువీకరించారు.టీసీఎస్.. భారత్‌లో దాదాపు 12,000 మందిని (మొత్తం ఉద్యోగుల్లో 2%) తొలగించి ఐటీ రంగంలో ఆందోళన కలిగించింది. అయితే ఇది ఏఐ వల్ల కాదని, నైపుణ్యాల అసమతుల్యత వల్లేనని సంస్థ స్పష్టం చేసింది.మెటా (600 మంది), గూగుల్ (100+), వెరిజోన్ (13,000), హెచ్‌పీ (4,000–6,000 మంది) వంటి సంస్థలు కూడా లేఆఫ్స్ ఇచ్చాయి. లేఆఫ్స్‌కు దారితీసిన కారణాలు చాలా కంపెనీలు ఇప్పుడు 'ఏఐ ఫస్ట్' విధానాన్ని అనుసరిస్తున్నాయి. గతంలో వందలాది మంది చేసే పనులను (డేటా ఎంట్రీ, కస్టమర్ సపోర్ట్, బేసిక్ కోడింగ్..) ఇప్పుడు ఏఐ టూల్స్ తక్కువ ఖర్చుతో వేగంగా చేస్తున్నాయి. కంపెనీలు తమ బడ్జెట్‌ను మానవ వనరుల నుంచి ఏఐ మౌలిక సదుపాయాల వైపు మళ్లిస్తున్నాయి.ద్రవ్యోల్బణం పెరగడం, సుంకాల భారం పెరగడంతో కంపెనీల నిర్వహణ ఖర్చులు పెరిగాయి. ఇన్వెస్టర్ల నుంచి ఒత్తిడి పెరగడంతో తక్కువ మంది ఉద్యోగులతో ఎక్కువ ఉత్పాదకత సాధించడంపై యాజమాన్యాలు దృష్టి పెట్టాయి.కరోనా సమయంలో డిజిటల్ సేవల కోసం డిమాండ్ పెరగడంతో టెక్ కంపెనీలు భారీగా నియామకాలు చేపట్టాయి. ఇప్పుడు డిమాండ్ సాధారణ స్థితికి రావడంతో అవసరానికి మించి ఉన్న సిబ్బందిని తొలగిస్తున్నాయి.పాత ప్రాజెక్టులను మూసివేసి కేవలం క్లౌడ్, సెక్యూరిటీ, జనరేటివ్ ఏఐ వంటి భవిష్యత్తు అవసరాల మీదనే కంపెనీలు పెట్టుబడి పెడుతున్నాయి. దీనివల్ల పాత నైపుణ్యాలు కలిగిన వారు ఉద్యోగాలు కోల్పోతున్నారు.టెక్ రంగం ప్రస్తుతం ఒక పరివర్తన దశలో ఉంది. ఉద్యోగాల కోత ఆందోళన కలిగించే విషయమే అయినా ఏఐ రంగంలో కొత్త రకమైన ఉద్యోగ అవకాశాలు కూడా పుట్టుకొస్తున్నాయి. సిబ్బంది తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవడమే ప్రస్తుత సంక్షోభం నుంచి గట్టెక్కే మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.

# పోర్ట్‌ఫోలియోకి దన్నుగా హైబ్రిడ్ ఫండ్స్

అంతర్జాతీయంగా వృద్ధి తీరుతెన్నులు, వడ్డీ రేట్ల అంచనాలు, లిక్విడిటీ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి షాక్‌లనైనా తట్టుకుంటూ, వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునేలా పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోను తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకు ఇటు ఈక్విటీ, అటు ఫిక్స్‌డ్ ఇన్‌కం సాధనాలను ఒకే దాంట్లో మేళవించి అందించే హైబ్రిడ్ ఫండ్స్, మీ పోర్ట్‌ఫోలియోకి దన్నుగా నిలబడగలవు. వీటిని సరిగ్గా ఉపయోగించుకోగలిగితే మార్కెట్లో ఎలాంటి పరిస్థితులెదురైనా దీర్ఘకాలిక ప్రణాళిక దెబ్బతినకుండా, ఇవి మీ ఆర్థిక ప్రణాళికకు వెన్నెముకగా నిలుస్తాయి.శక్తివంతమైన ఫీచర్లు..ఈ హైబ్రిడ్ ఫండ్స్‌లో పలు శక్తివంతమైన ఫీచర్లు ఉంటాయి. మొదటిది పరిశీలిస్తే, ఇందులోని ఈక్విటీ భాగం దీర్ఘకాలికంగా అధిక వృద్ధి, ద్రవ్యోల్బణానికి మించి రాబడులు అందించగలుగుతుంది. అదే సమయంలో డెట్ భాగమనేది పోర్ట్‌ఫోలియోకి స్థిరత్వాన్ని, రాబడిని అందిస్తూనే పతనాల వేళ ఆదుకుంటుంది. ఇక రెండో అంశమేమిటంటే, ఇది ఎమోషనల్ 'షాక్ అబ్జర్బర్'లాగా కూడా పని చేస్తుంది. ఫిక్స్‌డ్ ఇన్‌కం భాగమనేది మార్కెట్ భారీగా ఎగిసినప్పుడు ఉన్నప్పుడు ఈక్విటీల్లో అతిగా ఇన్వెస్ట్ చేయాలన్న అత్యుత్సాహాన్ని కాస్త నెమ్మదింపచేస్తుంది. మార్కెట్లు కరెక్షన్‌కి లోనైనప్పుడు పోర్ట్‌ఫోలియో మరీ పతనమైపోకుండా కాపాడుతుంది. పెట్టుబడులను కొనసాగించే శక్తినిస్తుంది. మూడో విషయం చూస్తే.. నిర్వహణపరంగా ఇది చాలా సరళంగా, క్రమశిక్షణను పెంపొందించే విధంగా ఉంటుంది. వివిధ స్కీములవ్యాప్తంగా ఈక్విటీ, డెట్, క్యాష్ పొజిషన్లను చూసుకుంటూ ఉండాలంటే బోలెడంత సమయం, రీబ్యాలెన్సింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా చాలా మటుకు ఇన్వెస్టర్లు తరచుగా పోర్ట్‌ఫోలియోను పరిస్థితికి తగ్గట్లు సత్వరం సరిచేసుకోలేరు. తీరా చేసే సరికి సమయం మించిపోతుంది. హైబ్రిడ్ ఫండ్స్ అలా జరగకుండా, పరిస్థితికి అనుగుణంగా పెట్టుబడులను వివిధ సాధనాలకు తగిన రీతిలో కేటాయించి రీబ్యాలెన్స్ చేస్తాయి. తద్వారా ప్రాక్టికల్‌గా,



సైకలాజికల్‌గా మీపై ఒత్తిడి తగ్గించే విధంగా ఉంటాయి. ఇవి చాలా సరళంగా ఉండటం వల్ల తే వి ్ర దా ల ం , లా వా దే వీ ల వ్యయాలు, ట్యాక్స్‌ల భారం లాంటివి తక్కువగా ఉంటాయి. **రిస్కు సామర్థ్యాలను బట్టి ఎంపిక..** ఇన్వెస్టర్లు వివిధ మార్కెట్ పరిస్థితులకి అనుగుణంగా ప్రతి త్రైమాసికంలో కొత్త ఉత్పత్తులను అన్వేషించాల్సిన పని లేకుండా వివిధ రకాల రిస్కు సామర్థ్యాలున్నవారికి అనువైనవిగా హైబ్రిడ్ ఫండ్స్ ఉంటాయి. వీటిలో అంతర్గతంగా పలు రకాలు ఉంటాయి. ఉదాహరణకు ఒక మోస్తరు రిస్కు సామర్థ్యాలు కలిగి ఉండి, ఈక్విటీల్లో పెట్టుబడులతో పాటు స్థిరత్వం కూడా కోరుకునే వారి కోసం మధ్యేమార్గంగా బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్ ఉంటాయి. ఒడిదుడుకులను ఎక్కువగా ఇష్టపడని వారికి కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్ అనువుగా ఉంటాయి. ఇక కాస్త ఎక్కువ రిస్కు సామర్థ్యాలు కలిగి ఉండి దీర్ఘకాలికంగా వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవాలనుకునే వారి కోసం అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్స్ ఉంటాయి.

# మిడిల్ క్లాస్ సప్తపది

## సంపాదనను మించిన ఖర్చులుంటే ఎవరికైనా కష్టమే

## మధ్యతరగతి మంత్రం.. ఖర్చులపై నియంత్రణే

## కొత్త ఏడాదిలో ఈ 7 సూత్రాలతో ఆర్థిక స్వాతంత్య్రం

## అత్యవసర నిధి నుంచి ఈఎంఐలు, ఓటీటీ చందాల వరకూ



జీతం చాలా ఎక్కువ. ఖర్చులు అంతకన్నా ఎక్కువ. ఏం లాభం? అందుకే... ఎంత సంపాదించామన్నది కాదు..! ఎంత ఖర్చు పెట్టాం, ఎంత పొదుపు చేశాం? అన్నదే ముఖ్యం. అదే మన జీవిత గమనాన్ని నిర్ణయిస్తుంది. మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక సమస్యలకు ప్రధాన కారణం ఆదాయం తక్కువగా ఉండడం కాదు. కాలం చెల్లిన 'మనీ' సూత్రాలను పట్టుకుని వేలాడటమే. ఖర్చులు ఆదాయాన్ని మించకుండా చూసుకుంటే మధ్యతరగతి వారయినా మహారాజుల్లా బతికేయొచ్చు. అందుకోసం ఈ 7 సూత్రాలు పాటించడం మాత్రం తప్పనిసరి. కొత్త సంవత్సరంలోనైనా పాటించాల్సిన ఈ 'సప్త పది' గురించి వివరించేదే ఈ 'వెల్త్' స్టోరీ... **అత్యవసర నిధి..** అవసరం వచ్చినప్పుడు సాయం కోసం ఒకరి దగ్గర చేయి చాచటమనేది చాలా ఇబ్బందికరం. ఒకప్పుడు మనుషుల మధ్య బంధాలను డబ్బుతో కొలవటమనేది తక్కువ. ఇపుడు ఎవరినైనా అడిగినా... వారు ఎంత దగ్గరివారైనా ఇస్తారన్న గ్యారంటీ లేదు. ఎందుకంటే వాళ్లకూ ఏవో అవసరాలు ఉండి ఉండొచ్చు. పైపెచ్చు మన అవసరాన్ని వాళ్లు గుర్తించకపోవచ్చు. అందుకని ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా ఎదుర్కొనేందుకు వీలుగా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవడం తెలివైన నిర్ణయం. అత్యవసర నిధి అన్నది ఆప్షనల్ కాదు. తప్పనిసరి. రాజీపడకూడనిది. కరోనా సమయంలో ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోండి. ఆస్పత్రిలో వైద్యం కోసం చాలామంది లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చింది. అదే సమయంలో ఉద్యోగం, ఉపాధి కోల్పోయిన వారెందరో. కొన్ని సంస్థలు అయితే వేతనాలకు కోత పెట్టాయి. చేస్తున్న ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో తెలియని అనిశ్చితి. వైద్యం కూడా అంతే. ఎప్పుడు ఏ ప్రమాదం, ఏ అనారోగ్యం ముంచుకొస్తుందో ఊహించలేం. అందుకే కనీసం ఆరు నెలల అవసరాలకు సరిపడా అత్యవసర నిధి ప్రతి కుటుంబానికి ఉండాలి. కుదిరితే 9 నెలలు, 12 నెలల అవసరాలకు సరిపడా నిధిని పక్కన పెట్టుకోవాలి.ఇలా చేయడం వల్ల దీర్ఘకాల లక్ష్యాల కోసం చేస్తున్న పెట్టుబడులను కదపకుండా ఉండొచ్చు. అధిక రేటుపై రుణాలు తీసుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా చూసుకోవచ్చు. **ఈఎంఐలు గీత దాటొద్దు..** అవసరం వస్తే క్రెడిట్ కార్డు చేతిలో ఉందిలే... వెంటనే రుణం దొరుకుతుందిలే. అనే రీతిలో అన్నింటికీ 'రుణ' మంత్రం పనికిరాదు. బ్యాంక్‌లు, ఫిన్‌టెక్‌లు పిలిచి రుణం ఇస్తున్నాయి కదా అని చెప్పి.. ఇల్లు, కారు, ఇంట్లో వస్తువులు ఇలా ప్రతిదానికీ అప్పు చేసుకుంటూ వెళితే, ఆర్థిక పరిస్థితులు క్రమంగా అదుపు తప్పుతాయి. నెల సంపాదనలో 5060 శాతం వరకు రుణ చెల్లింపులకే వెచ్చించే కుటుంబాలు మన మధ్య ఎన్నో ఉన్నాయి. ఆదాయంలో నెలవారీ రుణ వాయిదాలను (ఈఎంఐలు) 3540 శాతం మించకుండా చూసుకోవాలన్నది ముఖ్యమైన ఆర్థిక సూత్రం. దీనివల్ల ఇతర ముఖ్యమైన జీవన అవసరాలకు (గ్రోసరీ, యుటిలిటీ, విద్యా వ్యయాలు) ఇబ్బంది లేకుండా చూసుకోవచ్చు. ఆదాయమనేది నేటి అవసరాల కోసమే కాదు. భవిష్యత్ లక్ష్యాలు, విశ్రాంత జీవన అవసరాల కోసం కూడా. దీనికోసం ప్రతినెలా కొంత పక్కన పెట్టుకోవాలి. పిల్లల విద్య, వివాహాలు, సొంతిల్లు, రిటైర్మెంట్ జీవితం కోసం పెట్టుబడులకు కొంత కేటాయించుకోవాలంటే, ఆదాయంలో ఈఎంఐలు లక్ష్మణ రేఖ దాటకుండా చూసుకోవడం ముఖ్యం.ఈఎంఐలు హద్దు మీరి చెల్లింపుల్లో విఫలమైతే, అది క్రెడిట్ హిస్టరీని దెబ్బతీస్తుంది. ఆదాయం అప్పులకే పోతుంటే సంపద సృష్టి ఎప్పటికీ సాధ్యం కాదు. **ఆదాయాన్ని మించి పెట్టుబడి..** సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ఇపుడు బాగా ప్రాచుర్యం పొందిన పెట్టుబడి సాధనం. ఈ విధానంలో చేస్తున్న పెట్టుబడి, మన వార్షిక ఆదాయ వృద్ధికి మించి పెరిగేలా చూసుకోవాలి. వార్షిక వేతన పెరుగుదల సాధారణంగా 810 శాతంగా ఉంటుంది. కానీ, సిప్ పెట్టుబడులపై 1215 శాతం వరకు రాబడి వచ్చేలా పెట్టుబడి సాధనాలను ఎంపిక చేసుకోవాలి.ద్రవ్యోల్బణం కారణంగా కొంత కాలానికి మన పెట్టుబడి దాని




విలువను కోల్పోతుంటుంది. మన దగ్గర వార్షిక సగటు ద్రవ్యోల్బణం 56 శాతం స్థాయిలో ఉంటోంది. కనుక ఈ మేరకు మన పెట్టుబడి విలువ ఏటా క్షీణిస్తుంటుంది. ఇపుడు మన జీవన వ్యయాలు నెలవారీ రూ.10,000గా ఉన్నాయనుకుంటే.. 6 శాతం ద్రవ్యోల్బణం రేటు ప్రకారం పదేళ్ల తర్వాత అవే అవసరాల కోసం రూ.17,908 ఖర్చు చేయాల్సి వస్తుంది. అదే 20 ఏళ్ల తర్వాత అయితే రూ.32,071 అవసరం అవుతుంది. ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే పదేళ్లకు మించిన కాలంలో 1215 శాతం రాబడులు సాధ్యమేనని చరిత్ర చెబుతోంది. ఇక నెలవారీ చేస్తున్న సిప్ పెట్టుబడిని సైతం ఏటా ఆదాయ పెరుగుదలను మించిన స్థాయిలో పెంచుకోవడం ప్రధానం. లేదంటే కనీసం ద్రవ్యోల్బణం రేటు స్థాయిలో అయినా సిప్ పెట్టుబడిని ఏటా పెంచుకుంటూ వెళ్లాలి. ఇలా సిప్ పెట్టుబడిని పెంచుకుంటూ, ఆ పెట్టుబడి ద్రవ్యోల్బణం మించి వృద్ధి చెందేలా చూసుకుంటే, కాంపౌండింగ్ ప్రయోజనంతో పెద్ద మొత్తంలో నిధి సమకూరుతుంది. ఆరోగ్య బీమా రూ.5 లక్షలు చాలదు..మనలో చాలా మందికి ఆరోగ్య బీమా రక్షణ లేదు. ఉన్న వారిలోనూ చాలా మందికి రూ.5 లక్షలకు మించి కవరేజీ లేదు. కానీ, మారుతున్న పరిస్థితుల కోణంలో చూస్తే ఈ రక్షణ ఎంత మాత్రం చాలదని స్పష్టమవుతోంది. వైద్య రంగంలో ద్రవ్యోల్బణం 12 14 శాతం స్థాయిలో ఉంటోంది. అంటే చికిత్సలు, ఔషధాలు, ఇతరత్రా చార్జీలు ఈ స్థాయిలో ఏటా పెరుగుతున్నట్టు లెక్క. అత్యాధునిక వైద్య విధానాలు, రోబోటిక్ తరహా టెక్నాలజీలు రావడంతో క్లిష్టమైన సర్జరీలను సైతం సునాయాసయంగా, విజయవంతంగా చేస్తున్నారు. వీటి కోసం పెద్ద మొత్తంలో ఖర్చవుతోంది. అవయవ మార్పిడి కోసం రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు ఖర్చవుతోంది. కనుక రూ.5 లక్షల కవరేజీ ఎంతమాత్రం సరిపోదు. ఒక కుటుంబానికి కనీసం రూ.10 20 లక్షల వరకు అయినా బేసిక్ హెల్త్ ప్లాన్ ఉండాలి. రూ.1020 లక్షల డిడక్టబుల్‌తో సూపర్ టాపప్ ప్లాన్ తీసుకోవాలి. వైద్య బిల్లు రూ.10 20 లక్షల్లోపు ఉంటే బేసిక్‌ప్లాన్ నుంచి, అంతకు మించిన సందర్భాల్లో సూపర్ టాపప్ ప్లాన్ నుంచి చెల్లింపులు జరుగుతాయి. **రెండు చేతులా సంపాదించాల్సిందే..** ఒకవైపు కరెన్సీ విలువ క్షీణిస్తుండగా... మరోవైపు జీవన వ్యయాలు భారీగా పెరుగుతున్నాయి. కాబట్టి వీటికి తగ్గట్టు ఆదాయం కూడా వృద్ధి చెందాలి. కానీ మన ఆర్థిక డేటాను పరిశీలిస్తే.. ఆదాయ వృద్ధి కంటే జీవన వ్యయ పెరుగుదలే ఎక్కువగా కనిపిస్తోంది. అందుకే రెండో ఆదాయ మార్గంపై దృష్టి పెట్టాలి.అద్దె రూపంలో ఆదాయం లేదంటే తమ నైపుణ్యాల ఆధారంగా ఖాళీ సమయంలో ఫ్రీలాన్స్ వర్క్ లేదంటే వడ్డీ ఆదాయం లేదా డివిడెండ్ ఆదాయం ఇలా ఏదో ఒక మార్గం గుర్తించాలి. ఖర్చులపై కన్ను.. టీవీ ఛానళ్ల కోసం ఒకటి, నెట్‌ఫ్లిక్స్అమెజాన్ ప్రైమ్, ఆహా ఇలా వేర్వేరు ఓటీటీ చందాలు, క్లౌడ్ స్టోరేజీ, లెర్నింగ్ యాప్‌లు ఇలా చెప్పుకుంటూ పోతే డిజిటల్ లైఫ్ కోసం ప్రతి కుటుంబంలో నెలతిరిగేసరికి చందా చెల్లింపుల జాబితా పెరిగిపోతోంది. ఒక సర్వే ప్రకారం ఒక కుటుంబం ఈ తరహా రీచార్జ్‌ల కోసం కనీసం రూ.25,000 40,000 వరకు ఖర్చు చేస్తోంది. కనుక ఏదో ఒక వినోద ఓటీటీ, ఒక లెర్నింగ్ యాప్‌నకు పరిమితమై, అనవసర దుబారాను అదుపు చేసుకోవడం ద్వారా ఆర్థిక స్వేచ్ఛకు మార్గం వేసుకోవచ్చు.బంగారం కూడా బీమా లాంటిదే.బంగారాన్ని ఒక పెట్టుబడి సాధనంగా కంటే రక్షణ కవచంగానే (హెడ్జింగ్ సాధనం) ఎక్కువ పరిగణిస్తారు. ఆర్థిక అస్థిరతలప్పుడు, కరెన్సీ విలువ క్షీణించినపుడు, ద్రవ్యోల్బణం నుంచి పెట్టుబడి విలువను కాపాడుకోవడంలో బంగారం కీలకంగా పనిచేస్తుంది.ఈ ఏడాది బంగారం ధర దేశీ మార్కెట్లో 78 శాతం పెరిగింది. 2020లో రూ.48,000 స్థాయిలో ఉంది. ఐదేళ్లలో రెండు రెట్లు (200 శాతం వృద్ధి) పెరిగింది. గత రెండు దశాబ్దాల్లో చూస్తే బంగారంపై వార్షిక రాబడి 1112 శాతంగా ఉంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కంపెనీల లాభదాయకత ఆశాజనకంగా లేకపోవడం, వాణిజ్య అనిశ్చితులతో గడిచిన ఏడాది కాలంలో ఈక్విటీలు ఎలాంటి రాబడులు ఇవ్వలేదు. ఈ కాలంలో బంగారం విలువనుసృష్టించి పెట్టింది. కనుక పెట్టుబడుల్లో వైవిధ్యానికి, అనిశ్చితులు, కరెన్సీ విలువల నుంచి పెట్టుబడి విలువకు రక్షణ కోసం, అత్యవసరాల్లో రుణం పొందేందుకు సైతం బంగారం అక్కరకు వస్తుంది.నియంత్రించుకోవాలి



## బిగ్‌బాస్ తరహాలో కొత్త రియాలిటీ షో..

### ఆ 10 జంటలు వీళ్లేనా?

రియాలిటీ షోలంటే జనాలకు భలే ఇష్టం. రీల్ లైఫ్‌లో సెలబ్రిటీలను చూసి ఆరాధించే ప్రేక్షకులు వారు రియల్ లైఫ్‌లో ఎలా ఉంటారో తెలుసుకోవాలని తెగ తహతహలాడుతుంటారు. అందుకేగా బిగ్‌బాస్ షో అనేక భాషల్లో ఫేమస్ అయింది. బిగ్‌బాస్ తరహాలోనే హిందీలో ఇటీవల ద 50 అనే షో కూడా మొదలైంది. ఇప్పుడు తెలుగులో ఒక కపుల్ షో రాబోతోంది. అదే మ్యాడ్ ఫర్ ఈచ్ అదర్. ది అల్టిమేట్ టెస్ట్ ఆఫ్ లవ్ అనేది క్యాప్షన్.

**10 జంటలు - 70 రోజులు**

ఈ షోలో సెలబ్రిటీ జంటలు మాత్రమే పాల్గొననున్నారు. అందులో పెళ్లయినవాళ్లున్నారు. పెళ్లి చేసుకోకుండా డేటింగ్‌లో ఉన్నవారూ ఉన్నారు. 10 సెలబ్రిటీ జంటలు ఒక అద్భుతమైన విల్లాలో 70 రోజులపాటు ఉండనున్నారు. ఈ జంటల మధ్య ప్రేమ, రొమాన్స్, డ్రామా.. ఇలా అన్ని ఎమోషన్స్ చూపించనున్నారు. షో నిర్వాహకులు పెట్టే ప్రేమ పరీక్షలను వీరు ఎలా దాటుతారు? అన్నది ఆసక్తికరంగా ఉండనుంది.

**ఆ జంటలెవరంటే?**

ప్రస్తుతం సోషల్‌మీడియాలో వినిపిస్తున్న ఊహాగానాల ప్రకారం ఆ 10 జంటలెవరో ఓసారి చూసేద్దాం.. అమర్‌దీప్- తేజు, హరిత- హరీశ్, ప్రియాంక- శివకుమార్, అంజలి - పవన్ సంతోష్, నటరాజ్ మాస్టర్- నీతూ, సోనియా సింగ్- సిద్ధు, జబర్దస్త్ నూకరాజు- ఆసియా, సాండ్రా- మహేశ్‌బాబు, వాసంతి - పవన్ కల్యాణ్, శుభశ్రీ రాయగురు- అజయ్.

**అప్పుడే ప్రారంభం?**

వీరిలో అమర్‌దీప్, హరీశ్ (మాస్క్ మ్యాన్), ప్రియాంక జైన్, నటరాజ్ మాస్టర్, వాసంతి కృష్ణన్, శుభశ్రీ.. వీళ్లందరూ బిగ్‌బాస్ ద్వారా బుల్లితెర ఆడియన్స్‌కు దగ్గరైనవారే! మార్చి 2వ వారంలో ఓటీటీ ప్లాట్‌ఫామ్ జియో హాట్‌స్టార్‌లో ఈ షో మొదలు కానున్నట్లు తెలుస్తోంది. ఓటీటీలో వచ్చిన బిగ్‌బాస్ అగ్నిపరీక్ష బాగానే హిట్టయింది. మరి మ్యాడ్ ఫర్ ఈచ్ అదర్ ఎలాంటి స్పందన తెచ్చుకుంటుందో చూడాలి!



## 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ఓటీటీ రిలీజ్ ఫిక్స్..

మాస్ రాజా నటించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ఓటీటీ రిలీజ్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు గుడ్ న్యూస్ అందింది. థియేటర్లలో విడుదలైన తర్వాత నెల రోజుల్లోనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పైకి రావాల్సి ఉన్న ఈ చిత్రం, అనూహ్యంగా ఆలస్యం కావడంతో ప్రేక్షకుల్లో గందరగోళం నెలకొంది. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా త్వరలోన్గే జుజు5లో స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతోంది. సినిమా డిజిటల్ రిలీజ్ ఆలస్యం కావడానికి ప్రధాన కారణం ఇతర భాషల డబ్బింగ్ పనులేనని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో కూడా ఒకేసారి విడుదల చేయాలని జీ5 ప్లాన్ చేసినట్లు సమాచారం. మల్టీ లాంగ్వేజ్ స్ట్రాటజీతో పాన్-ఇండియా స్థాయిలో ప్రేక్షకులను చేరుకోవాలన్నదే ఈ నిర్ణయానికి కారణంగా తెలుస్తోంది. ఇటీవల చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు ' చిత్రాన్ని ఏడు భాషల్లో విడుదల చేసి మంచి స్పందన పొందిన నేపథ్యంలో, అదే తరహా వ్యూహాన్ని 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' విషయంలోనూ అమలు చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి కిషోర్ తిరుమల దర్శకత్వం వహించారు. రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాలో ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటించి ప్రేక్షకులను అలరించారు. థియేటర్లలో మంచి వినోదాన్ని పంచిన ఈ చిత్రం, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకుంది. ఐదు భాషల్లో ఒకేసారి విడుదలవుతుండటంతో ఈ సినిమా మరింతమంది ఆడియన్స్‌ను చేరుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజ ఫ్యాన్స్‌తో పాటు ఇతర భాషల ప్రేక్షకులు కూడా ఈ ఎంటర్టైనర్‌ను ఆస్వాదించే అవకాశముంది. థియేటర్లలో మిస్ అయిన వారు ఇప్పుడు ఓటీటీలో ఈ చిత్రాన్ని వీక్షించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొత్తానికి, 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' డిజిటల్ రిలీజ్‌తో మాస్ రాజా అభిమానులకు మరోసారి ఫుల్ ఎంటర్టైన్‌మెంట్ దక్కనుంది. త్వరలో అధికారిక రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నట్లు సమాచారం.



## ఆ హిట్ సినిమా నా బయోపిక్.. ఒకేసారి 26 క్లియర్ చేశా

హీరోగా రెండు సినిమాలు చేసినప్పటికీ ఒక్కటీ సక్సెస్ కాలేదు. అయినా సరే వరస వివాదాలతో వార్తల్లో నిలిచాడు చంద్రహాస్. ఈ నెల ప్రారంభంలో 'బరాబర్ ప్రేమిస్తా' మూవీతో థియేటర్లలోకి వచ్చాడు. ఇదొక సినిమా ఉందని కూడా తెలియనంతగా ఇలా వచ్చి అలా వెళ్లిపోయింది. దీని రిలీజ్ టైంలోనే 'గుంజీ గుంజీ' అనే బూతు పాట పాడి వివాదానికి కారణమయ్యాడు. ఓ జర్నలిస్టుకి వార్నింగ్ ఇచ్చి హాట్ టాపిక్ అయిపోయాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఇతడు.. తన గురించి మరిన్ని ఆసక్తికర విషయాల్ని బయటపెట్టాడు. ఇప్పటికీ తాను ఇంకా పూర్తిగా మెచ్యూర్ కాలేదని చెప్పిన చంద్రహాస్.. అప్పట్లో ఏ మాత్రం కోపం వచ్చినా సరే ఎవరనేది చూడకుండా చేయెత్తి కొట్టేసేవాడినని చెప్పుకొచ్చాడు. అలానే ప్రదీప్ రంగనాథన్ తీసిన 'డ్రాగన్' సినిమా తన బయోపిక్ అని అన్నాడు. అందులో చూపించినట్లే.. తాను కూడా నిజజీవితంలో చివరి సెమిస్టర్‌లో ఒకేసారి 26 సబ్జెక్టులు క్లియర్ చేసిన విషయాన్ని గుర్తుచేసుకున్నాడు. అప్పట్లో తన తండ్రి స్పైడర్ మ్యాన్ డ్రస్ కొనిస్తే.. దాన్ని వేసుకుని కింద ఇంటిలో ఉన్న పిల్లలకు చూపిస్తే.. డ్రస్ వేసుకుంటే సరిపోదు. స్పైడర్ మ్యాన్‌లా ఎగరాలి అని చెప్పేసరికి రెండో ఫ్లోర్ నుంచి కిందకు దూకేశానని కూడా చంద్రహాస్ చెప్పుకొచ్చాడు. అవకాశం లభిస్తే దర్శకులతో రాజమౌళి, సందీప్ రెడ్డి వంగాతో పనిచేయాలని అనుకుంటున్నట్లు కూడా చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ ఈ వీడియో బిట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

చంద్రహాస్ విషయానికొస్తే టీవీ నటుడు ప్రభాకర్ కొడుకు. తొలుత 'రామ్‌నగర్ బన్నీ' అనే మూవీ చేశాడు. 2024లో ఇది థియేటర్లలోకి వచ్చింది. ఏ మాత్రం ఆకట్టుకోలేకపోయింది. దీని ప్రమోషన్ల టైంలోనే కాస్త వింతగా ప్రవర్తించడం, మాట్లాడటంతో యాటిట్యూడ్ స్టార్ అని ట్రోల్ చేశారు. ఈ పేరుని తనకు ట్యాగ్‌గా పెట్టేసుకున్న చంద్రహాస్.. తొలి రెండు మూవీస్‌కి అదే ట్యాగ్ వేసుకోవడం విశేషం.

## జాతకం ప్రకారం.. ముందే థియేటర్లలోకి శ్రీ విష్ణు 'విష్ణు విన్యాసం'

కథను నమ్మి సినిమాలు చేస్తూ.. ప్రేక్షకులకు కావాల్సిన వినోదాన్ని అందించే పనిలో బిజీగా ఉన్న యాక్టర్లలో ముందు వరుసలో ఉంటాడు శ్రీ విష్ణు విలక్షణమైన పాత్రలతో ఇంప్రెస్ చేసే శ్రీ విష్ణు తాజాగా 'విష్ణు విన్యాసం' మూవీ చేస్తున్నాడని తెలిసిందే. క సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తుంది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్నఈ మూవీ టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఒంగోలు నేపథ్యంలో ఉండబోతున్న ఈ చిత్రంలో శ్రీ విష్ణు 'చిన్నూ' అనే పాత్రలో కనిపించనున్నాడు. జాతకాలు, వాస్తుపై విపరీతమైన నమ్మకంతో శ్రీ విష్ణు చేసే పనులు, దాని చుట్టూ తిరిగే ఎలిమెంట్స్ నేపథ్యంలో సాగే టీజర్‌లో శ్రీ విష్ణు యాస, డైలాగ్స్ మూవీ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని ముందుగా ఫిబ్రవరి 28,2026న థియేటర్లలో విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. అయితే ఒక రోజు ముందుగానే సినిమా రాబోతుంది. జాతకం ప్రకారం... ఈ ఫిబ్రవరి 27 నుంచి థియేటర్లలో నవ్వుల వర్షం కురుస్తుంది. మీ జాతకంలో నాన్ స్టాప్ ఫన్ దోషం మొదలవుతుంది..అంటూ మేకర్స్ నయా రిలీజ్ అప్‌డేట్ షేర్ చేశారు. ఈ చిత్రానికి రాధన్ సంగీతాన్ని అందిస్తుండగా, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మిస్తున్నారు. శ్రీ విష్ణు నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'మృత్యుంజయ్' ఫిబ్రవరి 27న రిలీజ్ కావాల్సి ఉండగా.. మార్చి 6కు విడుదల వాయిదా పడ్డది.




The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.in epaper.vaarthasandhya.in. Cell : 73961 22101 , 99517 51662.